





పండువెన్నెలలో సీతారాముల కల్యాణ దృశ్యం

కల్యాణ వైభోగమే..

కోదండరాముడి కల్యాణం..
కనీవిని ఎరుగని వైభోగం..
హరికి, సిరికి కల్యాణం..
దివిలో, భువిలో రమణీయం..
కోదండరాముని కల్యాణం..
కనిన కలుగును పెనుపుణ్యం..
కన్నుల పండుగ కల్యాణం..
దుష్టశిక్షణ, శిష్ట రక్షణ ఒసగెను జగతికి ఆనందం
లోక రక్షణకు కల్యాణం..
లోకోద్ధరణమే రామమతం..

- పండు వెన్నెల్లో.. శోభాయమానంగా సీతారాముల కల్యాణోత్సవం
- విద్యుద్దీపకాంతుల్లో మెరిసిన కల్యాణ వేదిక
- వేలాదిగా హాజరైన భక్తులు
- భారీ పోలీసు బందోబస్తు
- అలరించిన సంగీత కార్యక్రమాలు
- అధికారుల పర్యవేక్షణలో ప్రశాంతంగా పూర్తయిన కల్యాణం

రాజంపేట/ఒంటిమిట్ట, ఏప్రిల్ 22: ఆంధ్ర భద్రాద్రి కడప జిల్లా ఒంటిమిట్ట (ఏకశిలా నగరం) కోదండరాముడి కల్యాణోత్సవం సోమవారం రాత్రి కన్నులపండువగా జరిగింది. పండు వెన్నెల్లో, ఆకాశం నుంచి నెలరాజు తొంగి చూస్తుండగా ఆహ్లాదకరమైన వాతావరణంలో వేదపారాయణం మధ్య తిరుమల తిరుపతి దేవస్థానం వేదపండితులు, ఒంటిమిట్ట కోదండరామ ఆలయ అర్చకుల సంయుక్త ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. వేలాది మంది భక్తుల రామనామ సంకీర్తనలు, పండితుల చతుర్వేద పఠనం.. మంగళవాయిద్యాల నడుమ.. సోమవారం రాత్రి 8.12 గంటలకు స్వస్తిశ్రీ విజయాభ్యుదయ వాలివాహనశక చాంద్రమాన శ్రీ క్రోధినామ సంవత్సర, చైత్రశుద్ధ చతుర్థశి చిత్ర నక్షత్ర యుక్త శుభలగ్నములో శ్రీరామ చంద్రమూర్తి, సీతమ్మను పరిణయమాడాడు. రమణీయం.. కమనీయమైన ఈ సుందర దృశ్యాన్ని తిలకించిన భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. లోకకల్యాణార్థం.. జగమేలే వైకుంఠ రాముని జగత్ కల్యాణం ఆంధ్రాభద్రాద్రి ఏకశిలా నగిరి ఒంటిమిట్ట జగదభిరాముడి దివ్యక్షేత్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం అధ్వర్యంలో నభూతో నభవిష్యతి అన్న రీతిలో ఈ కల్యాణోత్సవం నిర్వహించారు. కోదండరాముడి కల్యాణోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ కార్యదర్శి కరికాలవలవన్ ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలను సమర్పించారు. అలాగే తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున టీటీడీ ఈవో ధర్మారెడ్డి, దంపతులు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలను, ముత్యాల తలంబ్రాలను కోదండరామునికి సమర్పించారు. ఎన్నికల కోడ్ కారణంగా రాజకీయ జోక్యం లేకుండా కేవలం టీటీడీ అధికారులు, కడప జిల్లా యంత్రాంగం పర్యవేక్షణలో ఈ కల్యాణోత్సవాన్ని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు.



కల్యాణం.. రమణీయం

ఒంటిమిట్ట కోదండరామాలయ కల్యాణ ప్రాంగణంలో సోమవారం రాత్రి 6.30-8.30 గంటల మధ్య సీతారాముల కల్యాణ వేడుకను వేదపండితులు వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవవరులకు నూతన పట్టువస్త్రాలు, టీటీడీ అందించిన బంగారు శఠారి, యజ్ఞోపవీతం ఆభరణాలను, వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. ముందుగా ఉత్సవ వరులను పల్లకిపై కొలువుదీర్చి 3.15 గంటలకు ప్రధాన ఆలయం నుంచి మంగళవాయిద్యాల మధ్య.. భక్తుల శ్రీరామ.. జయజయరామ ధ్వానాలతో కల్యాణ మండపం వద్దకు తీసుకువచ్చారు. అనంతరం 4.30 గంటల నుంచి 5 గంటల వరకు ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించారు. వేదికపైన రజిత సింహాసనంపై కల్యాణ మూర్తులను ఆశీనులు చేసి సాయంత్రం 6.30 గంటల నుంచి కల్యాణతంతును ప్రారంభించారు. భగవత్‌విజ్ఞాపనం, సభఅనుజ్ఞ, లోకకళ్యాణం కోసం సంకల్పం చేయించారు. కల్యాణంలోని పదార్థాలన్నీ భగవంతుని మయం చేసేందుకు పుణ్యాహవచనం నిర్వహించారు. రక్షాబంధనం, యజ్ఞోపవీతధారణ, మధుపర్కార్చనం చేశారు. మహాసంకల్పం అనంతరం కన్యాదానం చేసి సీతారామచంద్రుల ప్రవరలను చదివారు. రాములవారి వంశస్వరూపాన్ని స్తుతించారు. అగ్ని ప్రతిష్టాపన తరువాత సీతారాముల తల మీద జీలకర, బెల్లం ఉంచి శాస్త్రోక్తంగా కల్యాణ వేడుకను నిర్వహించారు. తదనంతరం మంగళాష్టకం, చూర్ణిక పఠించి మాంగళ్యసూత్ర పూజ, మంగళ సూత్రధారణ అక్షతారోహణం చేపట్టారు. పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం వేదపండితులు కంకన్ బట్టర్ రాజేష్‌కుమార్ మంగళసూత్రాన్ని భక్తులకు చూపించి సాక్షాత్తు లక్ష్మీనారాయణుడైన శ్రీరామ చంద్రమూర్తి చేత శ్రీ మహాలక్ష్మీ స్వరూపిణి సీతా మహాదేవికి శాస్త్రోక్తంగా 8.12 గంటల సమయంలో మాంగళ్యధారణ జరిపించి, స్వామి నివేదన, వేదస్వస్తి, మహదాశీర్వచనంతో కల్యాణ ఘట్టం పూర్తి చేశారు. అనంతరం ముత్యాల తలంబ్రాలు కల్యాణ మూర్తుల శిరస్సులపై పోసి కన్నుల పండుగగా కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో టీటీడీ ఈవో ధర్మారెడ్డి దంపతులు, దేవాదాయ శాఖ కార్యదర్శి కరికాల వలవన్, ఎస్ఎస్ రావన్, ప్రిన్సిపల్ సెక్రటరీ గిరిజాశంకర్, కడప కలెక్టర్ విజయరామరాజు, జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, ఉప జేఈవో రజిని, కడప జిల్లా జడ్జి శ్రీదేవి, జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్, ఎస్పీ సిద్ధార్థ కౌశల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంతులలో దగదగ

కల్యాణ వేదిక ప్రాంగణం చుట్టూ వైకుంఠాన్ని తలపించే విద్యుత్ దీప కాంతులు, శ్రీ సీతారామ లక్ష్మణులు, లక్ష్మీవెంకటేశ్వరుడు, మహావిష్ణువు లక్ష్మీతో పాటు వివిధ దేవతామూర్తుల విద్యుత్ కటౌట్‌లు కల్యాణోత్సవానికి మరింత శోభను తెచ్చాయి. కల్యాణోత్సవాన్ని భక్తులు దగ్గరగా వీక్షించేందుకు భారీ ఎల్ఈడీ స్క్రీన్‌లు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టీటీడీ అధ్వర్యంలో ఉక్కపోతకు గురికాకుండా ఏసీలు, కూలర్‌లను, ప్రాంగణంలో వీవీఐపీలు, వీఐపీలు, భక్తులకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. ఈ కల్యాణోత్సవాన్ని వేలాది మంది భక్తులు వీక్షించి భక్తితో పరవశించిపోయారు. ప్రతి భక్తుడికి మంచినీరు, మజ్జిగ, అన్నప్రసాదాలు, ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లను అందజేశారు. 150 కౌంటర్లలో అన్నప్రసాదాలు అందజేశారు.

అలరించిన సంగీత కార్యక్రమాలు

కల్యాణోత్సవం సందర్భంగా సంగీత కార్యక్రమాలు అలరించాయి. భజన, సంగీతం, నృత్యం, శ్రీరామనామామృతం, శ్రీరామ కృతుల నృత్యం అందరినీ అలరించాయి. తిరుపతి ఎస్వీ నృత్య కళాశాల అధ్యాపకురాలు లక్ష్మీ సువర్ణ బృందం నాదస్వరం, డోలు వాయిద్యం ఎంతో అలరించింది. డాక్టర్ వందన, చిన్నమ్మ దేవి, విద్యార్థులు మొత్తం 40 మంది శ్రీరామనామామృతం భజన వీనుల విందుగా నిర్వహించారు. ఎస్వీ సంగీత నృత్య కళాశాల డాక్టర్ ఉషారాణి ఆధ్వర్యంలో సీతా కల్యాణం, రామాయణ శబ్దం, కూచిపూడి నృత్యం ఎంతో ఆకట్టుకుంది. సీతారాముల కల్యాణం, శ్రీరామ పట్టాభిషేకం అంశాలను ఎంతో చక్కగా ప్రదర్శించారు. రవి సుబ్రమణ్యం, రఘువంశ సుధాబుధి, రామనామ యనరాదా.. భరత నాట్యం విశేషంగా ఆకట్టుకుంది.



పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న టీటీడీ అధికారులు













గజ వాహనంపై సీతారాములు

కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు సోమవారం రాత్రి సీతారాముల కల్యాణం తరువాత గజవాహనంపై సీతారాములు భక్తులను కటాక్షించారు. సీతారాములు మాత్రమే కలిసి విహరించే ఈ గజ వాహనానికి ఎంతో విశిష్టత ఉంది. రాజసానికి ప్రతీక మదగజం, రణరంగంలో, రాజదర్బారుల్లో, ఉత్సవాల్లో గజానిదే అగ్రస్థానం, గజేంద్రుడు రాములవారిని వహించినట్లు భక్తులు సదా కోదండరాముని హృదయ పీఠకపై వహించి సేవిస్తే స్వామి కృపకు పాత్రులు అవుతారు.



పది పరీక్షల్లో తృతీయ స్థానం

- జిల్లాలో 92.10 శాతం ఉత్తీర్ణత

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 22: పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో 92.10 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో వైఎస్ఆర్ జిల్లా తృతీయ స్థానంలో నిలిచింది. సోమవారం విజయవాడలో విద్యాశాఖ కమిషనర్ పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు 153 కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించారు. 27,729 మంది విద్యార్థులు హాజరు కాగా 25,538 మంది (92.10 శాతం) విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలురుకు సంబంధించి 14,214 మందికి 12,929 మంది, బాలికలకు సంబంధించి 13,515 మందికి 12,609 మంది (93.3 శాతం) ఉత్తీర్ణత సాధించారు. అలాగే ప్రథమ స్థానంలో 22,254 మంది విద్యార్థులు, 2,375 మంది ద్వితీయ స్థానంలో, 909 మంది తృతీయ స్థానంలో నిలిచారు. జిల్లాలో ఎయిడెడ్ స్కూళ్లకు సంబంధించి 768 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 650 మంది ఉత్తీర్ణత సాధించారు. బీసీ వెల్ఫేర్ 210 మందికి 208 మంది, ప్రభుత్వ హైస్కూళ్లలో 707 మందికి 590, కేజీబీవీలో 613 మందికి 593, మున్సిపల్ పాఠశాలలో 1776 మందికి 1425, ఏపీ మోడల్ స్కూల్ 254 మందికి 253 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రైవేట్ పాఠశాలలో 12,918 మందికి 12,609, ఏపీ రెసిడెన్సియల్ పాఠశాలల్లో 156 మందికి 154, ఏపీ సోషల్ వెల్ఫేర్ పాఠశాలల్లో 839 మందికి 816, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల్లో 99 మందికి 93, జిల్లా పరిషత్ పాఠశాలల్లో 9389 మందికి 8147 మంది ఉత్తీర్ణత సాధించారు. కాగా, జిల్లాలో పది పరీక్షలలో గతం కన్నా మెరుగైన ఫలితాలు సాధించామని డీఈఓ అనురాధ తెలిపారు.

పది ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రభంజనం

సికెదిన్నె, ఏప్రిల్ 22: ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం 2024 సంవత్సరం ఎస్ఎస్‌సీ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు ప్రభంజనం సృష్టించినట్లు విద్యాసంస్థల ఏజీఎం రమణయ్య తెలిపారు. సోమవారం విడుదల చేసిన ఫలితాల్లో 597, 596, 595, 594, 593 అత్యుత్తమ మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో కడప జిల్లా కీర్తిని విద్యాసంస్థలు చాటి చెప్పాయన్నారు. కడపజోన్ నుంచి 2,201 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా వంద శాతం పాసయ్యారన్నారు. 595పైగా ఐదుగురు, 590పైన 47 మంది, 586కుపైగా 114 మంది, 580కి పైగా 205 మంది, 575మార్కులకు పైగా 332 మంది, 550కి పైగా 840 మంది, 500పైగా 1560 మంది విద్యార్థులు మార్కులు సాధించారన్నారు. ఇంతటి ఘనవిజయం సాధించి విద్యాసంస్థల పేరును నిలబెట్టిన విద్యార్థినీ విద్యార్థులను అభినందించి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఒలంపియాడ్, ఐఐటి, నీట్, ఆర్ఎంవో పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు మరింత మంది ఉన్నారన్నారు. ప్రతి ఇద్దరిలో ఒకరికి ఎస్ఎస్‌సీ ఫలితాల్లో 550 మార్కులు సాధించడం శ్రీచైతన్య విద్యాసంస్థలకే సాధ్యమన్నారు. 2011 నుంచి ఇప్పటి వరకు ప్రతి సంవత్సరం విద్యార్థులు శ్రీచైతన్య విద్యాసంస్థల పేరు నిల బెడుతూ ఫలితాల్లో ఘనవిజయం సాధించారన్నారు. విజయం పట్ల చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ షీమ, నాగేంద్రలు అభినందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా బ్రాంచ్‌ల ప్రిన్సిపాళ్లు, కోఆర్డినేటర్లు, డీన్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పది ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో చైతన్య విద్యాసంస్థల ఏజీఎం రమణయ్య తదితరులు

రాచమల్లు నామినేషన్‌లో కోడ్ ఉల్లంఘన

- పట్టణంలో భారీగా బాణాసంచా పేల్చివేత
- ఆర్‌వో చాంబర్‌లోకి ఆరుగురిని అనుమతించిన పోలీసులు
- కోడ్ ఉల్లంఘనలపై కేసు నమోదు



ఆర్‌వో చాంబర్‌లోకి ఆరుగురిని అనుమతించిన పోలీసులు

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 22: వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి నామినేషన్ దాఖలు కార్యక్రమంలో అడుగడుగునా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారు. ఉదయం రామేశ్వరం దేవళాల దగ్గర నుంచి బయలుదేరి పట్టణమంతా వందలాది మంది కార్యకర్త లతో రాచమల్లు ఊరేగింపుగా నామినేషన్ కార్యక్రమానికి వచ్చారు. ఈ ఊరేగింపులో అడు గడునా భారీగా బాణాసంచా పేల్చారు. ఇంత పెద్ద ఎత్తున నామినేషన్ కోసం ర్యాలీ నిర్వహిస్తున్నా.. లక్షలాది రూపాయల టపాసులు పేల్చుతూ వున్నా ఎఫ్ఎస్‌టీ టీంలు ఏం చేస్తున్నట్లు అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇక తహసీల్దారు కార్యాలయం ఆవరణలోకి అభ్య ర్థితో సహా ఐదుగురిని మాత్రమే నామినేషన్ దాఖలుకు అనుమతించాల్సి వుంటే పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి ఆరుగురిని లోపలికి అనుమతించారు. అంతేకాకుండా మీడియా పాయింట్ వద్ద మొత్తం ఎనిమిది మందిని అనుమతించారు. నామినేషన్ ప్రక్రియ మొదలై నప్పటి నుంచి జర్నలిస్టులను కూడా తహసీల్దారు కార్యాలయంలోకి పోలీసులు అనుమతించ టంలేదు. కానీ ఆర్‌వో చాంబర్‌లోకి కోడ్ నిబంధనలు ఉల్లంఘించి వైసీపీ అభ్యర్థి రాచ మల్లు వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి, పద్మశాలీయ కార్పొరేషన్ చైర్ పర్సన్ జింకా విజయలక్ష్మి, కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మిదేవి, వైసీపీ నాయకులు కల్లూరు నాగేంద్ర, పోరెడ్డి నరసింహారెడ్డిలను పోలీసులు అనుమతించారు. దీనిపై జైభీంరావు భారత్ పార్టీ అభ్యర్థి, హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ నాయకుడు కరుణాకర్‌యాదవ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కాగా, ఎన్నికల నామినేషన్ ర్యాలీ సందర్భంగా కోడ్ ఉల్లంఘించి బాణా సంచా పేల్చడంపై ఎన్నికల ప్రవర్తనా నియమావళి నోడల్ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్ రఘునా థరెడ్డి త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో కోడ్ ఉల్లంఘన కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



రాచమల్లు నామినేషన్ ర్యాలీలో రాకెట్లు వదులుతున్న కార్యకర్తలు



అసంపూర్తిగా మిగిలి ఉన్న ఔట్‌ఫ్లో కాలువ

అడవిపల్లె గుర్తుందా.. రామచంద్ర...!

- పీలేరులో కానరాని జలయజ్ఞం పనులు
- నిర్వహణ లేక వెక్కిరిస్తున్న ఝరికోన

పీలేరు/ కలకిరి/ గుర్రంకొండ/ కలకడ/ వాల్మీకిపురం/ ఏప్రిల్ 22: సార్వత్రిక ఎన్నికలు-2019కు ముందు పీలేరు ఎమ్మెల్యే అభ్యర్థిగా వైసీపీ తరపున పోటీ చేసిన చింతల రామచంద్రారెడ్డి తమ పార్టీ అధికారంలోకి వస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని అనేక హామీలు ఇచ్చారు. ఆయన చెప్పినట్లుగానే ఆయన పార్టీ అధికారంలోకి వచ్చింది. జగన్ సీఎం కావడంతో ఆయన తండ్రి, దివంగత సీఎం వైఎస్ఆర్ హయాంలో చేపట్టిన జలయజ్ఞం పనులు పరుగులు పెడతాయని నియోజకవర్గ ప్రజలు ఆశించారు. మిగిలిన అంశాల్లో కూడా చింతల తన హామీలన్నీ నెరవేర్చుతారని నియోజకవర్గ ప్రజలు గంపెడాశలు పెట్టుకున్నారు. కాలచక్రంలో ఐదేళ్లు గిర్రున తిరిగాయి. ఆయన హామీలు మాత్రం అలాగే ఉండిపోయాయి. ఐదేళ్లుగా నియోజకవర్గంలోని జలవనరుల అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నాయి. పీలేరు నియోజకవర్గ సాగు, తాగునీటి అవసరాలకు జీవనాడి లాంటి అడవిపల్లె ప్రాజెక్టును అయితే ఆయన ఒక్కసారి కూడా సందర్శించిన దాఖలాలు లేవు. ఇక ఆయన స్వంత ఊరైన వాల్మీకిపురం పట్టణానికి తాగునీరు అందించేందుకు తలపెట్టిన భోగంపల్లె రిజర్వాయర్ పనులు అడుగు కూడా ముందుకు సాగలేదు. చింతల మరిచిపోయిన హామీలలో కొన్ని...

అడవిపల్లె రిజర్వాయర్.. అంతులేని జాప్యం !!

హంద్రీ-నీవా పథకంలో భాగంగా కేవీపల్లె మండలం అడవిపల్లె వద్ద రిజర్వాయర్ నిర్మించి కరువు పీడిత ప్రాంతమైన ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సాగు, తాగునీరు అందించాలని 2006లో అప్పటి వైఎస్ సర్కారు తలపోసింది. కేవీపల్లె, పీలేరు, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల, పాకాల, ఐరాల, పూతలపట్టు, తవనంపల్లె, బంగారుపాళెం, చిత్తూరు, గుడిపాల, పెనుమూరు మండలాల్లోని 80 వేల ఎకరాలకు సాగునీరు, అనేక వందల గ్రామాలకు తాగునీరు అందేలా రూపకల్పన చేశారు. జలయజ్ఞంలో అడవిపల్లె ప్రాజెక్టు నిర్మాణాన్ని 2006లో రూ.55.59 కోట్లతో ప్రారంభించారు. 2006లో ప్రారంభమైన మొదటి దశ పనులు 2016లో పూర్తయ్యాయి. అప్పట్లో ఆ ప్రాజెక్టు పరిశీలనకు సీఎం హోదాలో వచ్చిన చంద్రబాబు అడవిపల్లె రిజర్వాయర్ సామర్థ్యం గురించి తెలుసుకుని మరో టీఎంసీ పెంచి అక్కడి నుంచి పైపులైన్ల ద్వారా చిత్తూరు పట్టణానికి తాగునీరు అందిస్తానని ప్రకటించారు. ఆయన ఆదేశాల మేరకు రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచి నిర్మాణం చేయడానికి 2016లో అధికారులు రూ.29.21 కోట్లతో పనులు ప్రారంభించారు. టీడీపీ హయాంలో పరుగులు పెట్టిన రిజర్వాయర్ పనులు వైసీపీ అధికారంలోకి వచ్చాక నిధుల లేమితో మందగించాయి. హంద్రీ-నీవా పథకంలో భాగంగా గొలుసుకట్టు విధానంలో నిర్మితమైన ప్రాజెక్టులు కావడంతో ఎగువన రాయచోటి ప్రాంతంలోని రిజర్వాయర్లు నిండితేగానీ అడవిపల్లె రిజర్వాయర్ నిండే పరిస్థితి లేదు. ప్రస్తుతానికి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో తెచ్చే కాలువలు కూడా అసంపూర్తిగా ఉండడంతో కేవలం వర్షాధారంగా ప్రాజెక్టు నిండుతోంది.

ప్రతిపక్షంలో వద్దు... అధికారంలోకి వచ్చాక ముద్దు

వైసీపీ నాయకులు ఎందుకనో ముందు నుంచీ అడవిపల్లె ప్రాజెక్టుపై పెద్దగా శ్రద్ధ చూపలేదు. కానీ చంద్రబాబు నాయుడు ప్రతిపాదించిన చిత్తూరు పట్టణానికి పైపు లైను పనులపై మాత్రం ప్రత్యేక శ్రద్ధ చూపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అడవిపల్లె ప్రాజెక్టులోని నీరంతా పీలేరు నియోజకవర్గానికే పరిమితం చేయాలని, చుక్కనీరు కూడా బయటకు ఇవ్వమంటూ ధర్నాలు, రాస్తారోకోలు, పాత్రికేయ సమావేశాలు నిర్వహించారు. అధికారంలోకి వచ్చాక గుట్టు చప్పుడు కాకుండా పైపులైను పనులు పూర్తి చేసేశారు. అధికార పార్టీ నేతల కారణంగా అడవిపల్లె ప్రాజెక్టు నుంచి చిత్తూరు సమీపంలోని ఎన్టీఆర్ జలాశయం వరకు సుమారు రూ.300 కోట్లతో పైపులైను నిర్మించారు. ఆ పనుల్లోనూ స్థానిక నాయకులకు అమ్యామ్యాలు ముట్టాయని పెద్దఎత్తున పుకార్లు ఉన్నాయి. పైపులైను నిర్మాణంపై చూపిన శ్రద్ధలో పావువంతు ప్రాజెక్టులోని నీరు తేవడంపై పెట్టి ఉంటే బావుండేదని, కుప్పం నియోజకవర్గానికి కృష్ణా జలాలు తరలించుకుపోగలిగిన వారు అడవిపల్లెకు మాత్రం నీరు తెప్పించుకోలేకపోవడం ఏమిటని పీలేరు నియోజకవర్గ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

మేడికుర్తి బాహుదా ప్రాజెక్టుకు జల'విఘ్నం'!

కలికిరి మండలం మేడికుర్తి గ్రామం వద్ద బాహుదా నదిపై నిర్మించిన ప్రాజెక్టు కొట్టుకుపోయి తొమ్మిదేళ్లు అవుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. 2015లో కురిసిన వర్షాలు, వరదలకు ఆ ప్రాజెక్టు పూర్తిగా కొట్టుకుపోయింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆ ప్రాజెక్టు గురించి పదే పదే ప్రస్తావించిన ఎమ్మెల్యే చింతల ఎందుకనో అధికారంలోకి వచ్చాక దాని గురించి పట్టించుకోలేదు. కలికిరి మండలంలోని 4400 ఎకరాలకు నేరుగా సాగునీరు, పరోక్షంగా భూగర్భజలాల పెంపు ద్వారా మరో 5 వేల ఎకరాలకు నీరందించేందుకు 2001లో టీడీపీ ప్రభుత్వం రూ.12.33 కోట్లతో ఆ ప్రాజెక్టు నిర్మాణానికి సిద్ధమైంది. ఆ పనులను ప్రస్తుత మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి చెందిన పీఎల్ఆర్ సంస్థ దక్కించుకుంది. 2300 మీటర్ల మట్టికట్ట, 420 మీటర్ల పొడవుతో సిమెంటు మొరవ, తూముల నిర్మాణం, ఆశించిన 4400 ఎకరాల ఆయకట్టుకు నీరందించడానికి 12 కి.మీతో ఎడమ కాలువ, 16 కి.మీతో కుడి కాలువ నిర్మాణానికి ఆ సంస్థ పనులు చేపట్టింది. అయితే ఎడమ కాలువ 8 కి.మీ, కుడికాలువ 4.5 కి.మీ. మాత్రం పూర్తి చేశారు. నిధులు సరిపోలేదని కాలువల పనులను అర్థంతరంగా వదిలేశారు. అరకొరగా 2003 నాటికి ప్రాజెక్టును మాత్రం పూర్తి చేశామనిపించారు. ఆ తరువాత కురిసిన వర్షాలకు ప్రాజెక్టు నిండింది. అయితే సిమెంటు మొరవకు చిల్లులు పడి జల్లెడగా మారడంతో నీళ్లన్నీ వృథా అయ్యాయి. ఆ తరువాత ఏడాది కురిసిన వర్షాలకు ప్రాజెక్టు మట్టి కట్టడంలో లీకేజీలు మొదలయ్యాయి. 2015లో కురిసిన భారీ వర్షాలకు మొరవ, మట్టికట్టల్లో లీకేజీలు ఉధృతం కావడంతో ప్రాజెక్టు పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో మేల్కొన్న ప్రభుత్వం, ప్రాజెక్టులో తాత్కాలికంగానైనా నీటిని నిలిపేందుకు రూ.25 లక్షలు మంజూరు చేసింది. ఆ నిధులతో గోనె సంచుల్లో ఇసుక నింపి అడ్డుకట్ట వేసినా అవి కూడా కొట్టుకుపోయాయి. ఇసుక బస్తాల వ్యవహారంలోనూ భారీ అవినీతి జరిగినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. మేడికుర్తి ప్రాజెక్టును తాత్కాలికంగానైనా పునరుద్ధరించి నీరు నిలపాలంటే రూ.5 కోట్లు ఖర్చవుతుందని అధికారులు అంచానా వేస్తున్నారు. తమ స్వంత సంస్థ చేసిన నిర్వాకం కావడం వల్లో ఏమో, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి మేడికుర్తి ప్రాజెక్టు గురించి ఏనాడూ పట్టించుకున్న దాఖలాలు లేవు.



అడవిపల్లె రిజర్వాయర్ కుడి ఆనకట్ట



మేడికుర్తి ప్రాజెక్టులో ఇసుక బస్తాలతో నిర్మించిన తాత్కాలిక కట్ట (ఫైల్)

నిర్వహణ కరువైన ఝరికోన

పీలేరు నియోజకవర్గంలోని కలికిరి, కేవీపల్లె, కలకడ మండలాల తాగునీటి ఎద్దడి శాశ్వత నివారణకు నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు కేవీపల్లె మండలంలో ఝరికోన ప్రాజెక్టు నిర్మించారు. అప్పట్లో కడప జిల్లా నాయకులతో విభేదించి మరీ ఆ ప్రాజెక్టును నిర్మించారాయన. సుమారు రూ.100 కోట్లతో ప్రాజెక్టు నిర్మాణం, గువ్వలగుడ్డం వద్ద నీటిశుద్ధి ప్లాంటు ఏర్పాటు చేశారు. గువ్వలగుడ్డం వద్ద ఉన్న శుద్ధి ప్లాంటు నుంచి ఆ మూడు మండలాల్లో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీటిని సరఫరా చేసి ప్రజలకు సురక్షిత తాగునీరు అందించడం ఝరికోన ప్రాజెక్టు లక్ష్యం. 2014-19 వరకు సజావుగా సాగిన ఆ ప్రాజెక్టు నిర్వహణ వైసీపీ ప్రభుత్వం వచ్చాక పూర్తిగా కుంటుపడింది. ప్రతి నెలా విడుదల చేయాల్సిన నిర్వహణ నిధులను ఏడాదికో సారి విడుదల చేస్తూ దాని గురించి పట్టించుకోవడం మానేసింది. పోనీ ఎమ్మెల్యే అయినా దాని గురించి పట్టించుకున్నారా అంటే అదీ లేదు. నిర్వహణ నిధుల లేమి కారణంగా ప్రస్తుతం ఆ ప్రాజెక్టు పైపులైన్ లీకేజీలను సకాలంలో పూడ్చలేకున్నారు అధికారులు.

పిచ్చి మొక్కలతో నిండిన హంద్రీ-నీవా కాలువలు

పీలేరు మండలంలోని హంద్రీ-నీవా కాలువలు పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. ఆ పథకం గురించి కనీసం ఒక్కసారి కూడా ఎమ్మెల్యే పట్టించుకున్న దాఖలాలు లేదు. పీలేరు నియోజకవర్గంలో సుమారు 70 వేల ఎకరాలకు సాగునీరు అందించే కాలువలు నేడు పూడిపోయే దుస్థితికి చేరుకున్నాయి. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎందుకనో వైసీపీ నాయకులు వాటి గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. వ్యవసాయాన్ని పండుగ చేస్తామని పదేపదే ప్రకటనలు గుప్పించడం మినహా వ్యవసాయ అభివృద్ధి కోసం వారు చేసింది శూన్యం. హంద్రీ-నీవా పథకం అనుకున్నట్లు సమగ్రంగా పూర్తయి ఉంటే పీలేరు నియోజకవర్గ రైతాంగం లాభపడినంతగా మరే నియోజకవర్గ ప్రజలకు లాభపడి ఉండరని పలువురు విశ్రాంత ఇంజనీరింగ్ శాఖ అధికారులు తెలిపారు.

భోగంపల్లె రిజర్వాయర్‌లోనూ అదే అలసత్వం

వాల్మీకిపురం పట్టణ తాగునీటి అవసరాల కోసం రూపొందించిన భోగంపల్లె రిజర్వాయర్ కూడా గత ఐదేళ్లలో అభివృద్ధికి నోచుకోలేదు. వాల్మీకిపురం పట్టణ తాగునీటి అవసరాల కోసం 2008వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వ చీఫ్ విప్‌గా ఉన్న నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి కారణంగా రూ.7 కోట్ల వ్యయంతో భోగంపల్లె రిజర్వాయర్‌ను ప్రారంభించారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ద్వారా సుమారు 1400 ఎకరాలకు సాగు నీరు అందించాలని కూడా సంకల్పించారు. అయితే దాని గురించి ఆ తరువాత ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం ఆ ప్రాజెక్టు ఉందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది.

అదే పనిగా నీటి వనరుల విధ్వంసం

గడిచిన ఐదేళ్లుగా ఇసుక తవ్వకాల కోసం అధికార పార్టీ నాయకులు నదులు, చెరువులు, కుంటలు, కాలువలు, చెక్ డ్యాంలు వంటి నీటి వనరుల విధ్వంసానికి సిద్ధమయ్యారు. అక్రమార్జనే ధ్యేయంగా చెలరేగిపోయారు. పీలేరు నియోజకవర్గంలో సుమారు 1200 చిన్నా, పెద్దా చెరువులు ఉండగా, వాటిలో కనీసం సగం బంగారు, బొగ్గు గనులను తలపిస్తున్నాయి. ఇక నియోజకవర్గంలోని బాహుదా, పింఛా నదీ పరీవాహక ప్రాంతాల్లోని వందలాది చెక్ డ్యాంలు తెగిపోయినా పట్టించుకున్న నాథుడు లేదు.



బొగ్గు గనులను తలపిస్తున్న గూడరేవుపల్లె ఆది కుంట చెరువు

వాయల్పాడుకు రెండుసార్లు ఉప ఎన్నిక



నల్లారి అమరనాథ రెడ్డి

కలికిరి, ఏప్రిల్ 22: కొత్తగా పీలేరు నియోజకవర్గ రాకముందున్న వాయల్పాడు నియోజకవర్గానికి రెండు పర్యాయాలు ఉప ఎన్నికలు జరిగాయి. ఒకే వ్యక్తి కారణంగా ఈ రెండు ఉప ఎన్నికలు జరగడం విశేషం. అప్పటికే రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఉన్న సీనియర్ నాయకుడు పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి 1962 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆయనకు ప్రత్యర్థిగా ఓ నూనూగు మీసాల యువకుడు ఆయనతో తలపడేందుకు సిద్ధమయ్యారు. ఆయనే ప్రస్తుత కలికిరి మండలం నగరిపల్లెకు చెందిన నల్లారి అమరనాథ రెడ్డి (ప్రస్తుత బీజేపీ ఎంపీ అభ్యర్థి, మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి, పీలేరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కిశోర్‌కుమార్ రెడ్డి తండ్రి). అమరనాథరెడ్డి ఎన్నికల గుర్తు ఏనుగు. అప్పట్లో కాసు బ్రహ్మానంద రెడ్డి, నీలం సంజీవ రెడ్డి వంటి ఉద్ధండుల కోటరీలో ప్రధానంగా ఉన్న తిమ్మారెడ్డి అనూహ్య రీతిలో అమరనాథరెడ్డి చేతిలో ఓడిపోయారు. ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన అమరనాథ రెడ్డి 643 ఓట్ల మెజారిటీ సాధించారు. అనంతరం కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రయ్యారు. తిమ్మారెడ్డి ఓటమిని జీర్ణించుకోలేక అమరనాథ రెడ్డికి పోటీ చేయడానికి అవసరమైన 25 ఏళ్ల వయసు లేని కారణంగా ఆయన ఎన్నికను రద్దు చేయాల్సిందిగా కోర్టులో కేసు వేశారు. అధికార పార్టీ నాయకుల ప్రయత్నాల కారణంగా అమరనాథ రెడ్డికి సరైన రికార్డులు అందుబాటులో లేకపోవడంతో ఆయన ఎన్నిక రద్దయ్యింది. దీంతో 1965లో వాయల్పాడుకు ఉప ఎన్నిక జరగడం సరైన పోటీ లేకపోవడంతో కాంగ్రెస్ తరపున తిమ్మారెడ్డి గెలవడం జరిగిపోయింది. అయితే 1972లో కాంగ్రెస్ టికెట్టు సాధించిన అమరనాథరెడ్డి మళ్లీ గెలిచారు. తరువాత 1978లో మరోసారి గెలిచి మంత్రిగా పనిచేశారు. అనంతరం 1985లో ఏపీ అసెంబ్లీకి జరిగిన మధ్యంతర ఎన్నికల్లో అమరనాథ రెడ్డి వాయల్పాడు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అయితే 1987లో ఆయన ఆకస్మికంగా మరణించడంతో రెండోసారి వాయల్పాడు నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఒకే వ్యక్తి కారణంగా ఒక నియోజకవర్గంలో రెండు ఉప ఎన్నికలు జరగడం అరుదైనదిగా చెబుతారు.

గంజాయి వనమే.. తిరిగి తులసివనమైంది



మేడా మల్లికార్జునరెడ్డి

రాజంపేట, ఏప్రిల్ 22: ఐదేళ్ల కిందట తెలుగుదేశం పార్టీ అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి వైసీపీలోకి వెళుతూ ఓ పెద్ద సంచలన ప్రకటన చేయడంతో తెలుగు రాష్ట్రాల్లోనూ బాంబులా ఆ మాట పేలిపోయింది. అదేంటంటే.. తెలుగుదేశం పార్టీ నుంచి వైసీపీలోకి పోవడం గంజాయి వనం నుంచి.. తులసివనంలోకి వెళ్లినట్లుంది.. అని సంచలానాత్మక ప్రకటన చేశారు మేడా. ఇది అప్పటి నుంచి ఇప్పటి వరకు అందరి నోటా సందర్భాన్ని బట్టి వింటున్న మాటే.. ఇంతలో మేడా మల్లికార్జునరెడ్డి నాడు ప్రకటించిన ప్రకటన ప్రకారం తాను గంజాయి వనం నుంచి తులసివనంలోకి పోయినట్లుంది అన్న మాట ఇప్పుడు రివర్స్ అయ్యింది. నాడు మేడా ప్రకటించిన ప్రకటన ప్రకారం తాను ఆనాడు భావించిన తులసివనంలో అత్యంత చేదు అనుభవం ఎదురైంది. రెడ్ల సామాజికవర్గంలో అంగబలం, అర్థబలం అన్నీ ఉన్నా కూడా టికెట్టు రాని వారు ఎవరైనా ఉన్నారంటే అది మేడా మాత్రమే. ఈ సమయంలో తనకు టికెట్టు రాకపోవడంతో ఆయన పడుతున్న బాధ ఇంతా అంతా కాదు. తన రాజకీయ ప్రత్యర్థి అయిన ఆకేపాటి అమర్‌నాథరెడ్డికి టికెట్టు కేటాయించడం ఆయనకు ఏమాత్రం రుచించలేదు. తాను అనుకున్న తులసివనమే అసలైన గంజాయి వనం అనుకుని నిజాన్ని తెలుసుకున్నట్లున్నారు. మనం అనుకున్నది ముమ్మాటికి తప్పు అని తలచినట్లున్నారు. ఇప్పుడు తన నియోజకవర్గంలోని ఆరు మండలాల ప్రధానమైన తన నేతలందరినీ తెలుగుదేశం పార్టీలోకి చేర్పించి అదే నిజమైన తులసివనమని చెప్పకనే చెప్పినట్లైంది. ఇది అందరినోటా నేడు ఆసక్తిగా మారింది.

ఈశాన్యం నుంచే ఎన్నికల ప్రచారం

- కాశీరావుపేట ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు
- 20 ఏళ్లుగా అభ్యర్థులకు ఇదే సెంటిమెంట్

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 22: ఎన్నికల్లో పోటీ అంటేనే నాస్తికులకు కూడా దైవభక్తి పుట్టుకొస్తుంది. శుభమా అని ఎన్నికల ప్రచారం చేయడానికి మదనపల్లె నియోజకవర్గంలో 20 ఏళ్ల పలు రాజకీయ పార్టీల అభ్యర్థులు నియోజకవర్గానికి ఈశాన్య దిశ నుంచే ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తున్నారు. ముఖ్యంగా మదనపల్లె మండలం కాశీరావుపేట గ్రామం వద్ద వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో ఎన్నికల కరపత్రాలు ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అక్కడి నుంచే అభ్యర్థులు ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తున్నారు. మదనపల్లె నియోజకవర్గంలో మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాలతో పాటు పట్టణం కలసి ఉంది. ఈ నియోజకవర్గానికి ఈశాన్యం వైపున మదనపల్లె మండలం కొత్తవారిపల్లె పంచాయతీ కాశీరావుపేట గ్రామం ఉంది. జాతీయ రహదారి పక్కనే వెలసిన అంజనేయస్వామి ఆలయం చాలా మందికి సెంటిమెంట్‌గా మారింది. 2004లో ఎన్నికల ప్రచారం సందర్భంగా టీడీపీ అభ్యర్థి దొమ్మలపాటి రమేశ్ ఇక్కడి నుంచే ఎన్నికల ప్రచారం ప్రారంభించి విజయం సాధించారు. 2009లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎం.షాజహాన్‌బాషా కూడా ఈ ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి ఇక్కడి నుంచే ప్రచారం ప్రారంభించి విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి దేశాయ్ తిప్పారెడ్డి కాశీరావుపేట ఆంజనేయస్వామి

• సెంటిమెంటు

ఆలయం నుంచే ఎన్నికల ప్రచారం చేసి గెలిచారు. ఇదిలా ఉండగా 2024 సంవత్సరంలో ప్రస్తుతం జరిగే ఎన్నికల సందర్భంగా టీడీపీ టికెట్ దక్కించుకున్న షాజహాన్‌బాషా మంగళగిరి నుంచి నేరుగా తిరుపతి మీదుగా వచ్చి ఈశన్య దిశలో నియోజకవర్గంలో అడుగుపెట్టి కాశీరావుపేట ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేసి తన సెంటిమెంట్‌ను నిలుపుకున్నారు. దీనిని చూసి వైసీపీ అభ్యర్థి నిస్సార్ అహ్మద్ కూడా ఇక్కడి నుంచే ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఇలా 20 ఏళ్లుగా అభ్యర్థులు ఈశాన్య దిక్కులో ప్రచారం ప్రారంభించడం సెంటిమెంట్‌గా మారింది.




మదనపల్లె నియోజకవర్గం ఈశాన్య దిక్కున వెలసిన కాశీరావుపేట ఆంజనేయస్వామి ఆలయం

దేశసేవ + ప్రజాసేవ = కృష్ణారెడ్డి

- ప్రజల మనిషిగా గుర్తింపు

సుండుపల్లె, ఏప్రిల్ 22: దేశ రక్షణే కాదు జన్మనిచ్చిన పేద ప్రజలకు మంచి చేయాలన్న సంకల్పంతో కెప్టెన్ మిన్నమరెడ్డి కృష్ణారెడ్డి కృషి ఎనలేనిది. మారుమూల సుండుపల్లె మండలం నుంచి దేశ రక్షణ వలయానికి కెప్టెన్‌గా వ్యవహరించడం ఒక మిన్నమరెడ్డి కుటుంబానికి దక్కిన వరం. అయితే అలాంటి వ్యక్తి రాయచోటి నియోజకవర్గ ప్రజలకు సేవలందించడం అంటే నియోజకవర్గ ప్రజలు చేసుకున్న అదృష్టమనే చెప్పాలి. పీలేరు నియోజకవర్గ మిన్నమరెడ్డిగారిపల్లెకు చెందిన రాఘవరెడ్డి పార్వతమ్మల కుమారుడే మిన్నమిరెడ్డి కృష్ణారెడ్డి చరిత్రలో ఒక అధ్యాయాన్ని లిఖించారు. 1937 సంవత్సరంలో బ్రిటీష్ ప్రభుత్వం చట్టబద్ధంగా పాలన నిర్వహించేందుకు ప్రయత్నాలు సాధించింది. అందుకు తొలిమెట్టు దేశవ్యాప్తంగా 1937లో కేంద్ర ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్న సమయంలో మిన్నమరెడ్డి కృష్ణారెడ్డి మిలిటరీలో చేరారు. ఆ సమయంలో మిలిటరీలో పనిచేయడమే కాదు బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా మాట్లాడితేనే కఠిన శిక్షలు పడే సమయంలో దేశం కోసం ఆయన చేసిన కృషిని ఎవరూ మరిచిపోరు. అనంతరం మిలటరీలో అనేక ఉన్నత పదువులు అలంకరించి కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించి దేశ రక్షణ దళానికి ఆయన దిక్సూచిగా మారారు. అలాంటి వ్యక్తి రాయచోటి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి 1967 సంవత్సరంలో గెలుపొంది 1972వ సంవత్సరం వరకు ఎమ్మెల్యేగా ప్రజలకు విశేష సేవలందించారు. ప్రజలకు మంచి చేయడంతో ఆయనకు ఎనలేని గుర్తింపు లభించింది. ఆయనతో పాటు ఆయన కుటుంబానికి సైతం గుర్తింపు వచ్చింది. ప్రస్తుతం ఆయన సతీమణి పార్వతమ్మ సుండుపల్లెలోని వారి కుమారుడు గంగిరెడ్డి వద్ద నివాసం ఉంటున్నారు. వారి కుటుంబ సభ్యులు ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నారు.





కృష్ణారెడ్డి (ఫైల్), కృష్ణారెడ్డి సతీమణి పార్వతమ్మ

ప్రజల కోసం ఎమ్మెల్యే అయ్యాడు

- పార్వతమ్మ, కెప్టెన్ కృష్ణారెడ్డి సతీమణి

దేశ రక్షణ కోసం మిలటరీలో పనిచేశాడు. అప్పట్లో మిలటరీలో చేరడాన్ని మేమందరం వద్దన్నా దేశం కోసం చేరాడు. మిటరీలో పనిచేసేటప్పుడు చాలా గర్వంగా ఉందని చెప్పేవాడు. అదే రీతిలో మంచి హోదా దక్కింది. వయసు పెరిగే కొద్దీ స్థానిక ప్రజలకు సేవ చేయాలని భావించాడు. అదే అదునుగా ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం వచ్చింది. ప్రజలు అఖండ మెజార్టీతో గెలిపించారు. ఎక్కడ చూసినా మంచి గుర్తింపు.. ఆ గుర్తింపు మిటరీలో పనిచేయడం వల్లనే లభించింది. డబ్బు కంటే మంచితనానికి, హోదాకు ప్రజలు అప్పట్లో ఆదరించారు. సుండుపల్లె మండలం కూడా అప్పుడు రాయచోటి నియోజకవర్గంలోనే ఉండేది. ఆయన ప్రజలకు చేసిన మంచే ఇప్పుడు మాకు ఎంతో గౌరవాన్ని ఇస్తోంది. ఆనాటి రాజకీయాలు స్వేచ్ఛగా ఉండేవి. ఇప్పుడు అలా లేవు.

రాజకీయాల్లో ఆత్మహత్యలే గానీ హత్యలుండవు...



రాజంపేట, ఏప్రిల్ 22: రాజకీయంగా ఎంతో ఉద్ధండులైన నాయకులు.. ఒకచోట కూర్చున్నారు. ఏడు పదుల వయస్సులో నాటి.. నేటి రాజకీయాలపై వారిద్దరూ నెమరు వేసుకున్నారు. ఈ విషయం చాలా ఆసక్తి గొల్పించింది. ఎప్పుడైనా అప్పటి నుంచి ఇప్పటి వరకు 50 ఏళ్ల రాజకీయాన్ని ఒకసారి తిరగేస్తే రాజకీయాల్లో హత్యలుండవు.. ఆత్మహత్యలే తప్ప అని అనుకున్నారు. ఏమిటీ.. అని ఆలోచిస్తే రాజకీయాల్లో సర్వం పోగొట్టుకుని, కుటుంబాన్ని వదిలి, రాత్రింబవళ్లు కష్టపడి, ఉన్నదంతా పోగొట్టుకొని ఫలానా పదవి కావాలని పోటీ పడితే అది వచ్చేది లేదు.. సచ్చేది లేదు. ఒకప్పుడు రాజకీయాలు విలువలతో కూడుకుని ఉండేవి.. ప్రజాసేవ కోసమే ఈ రంగంలోకి ఉన్నత మనస్తత్వం కలిగిన వ్యక్తులు వచ్చేవారు.. ఇప్పుడు ఇది వ్యాపారమైపోయింది. ఒక ఎమ్మెల్యే టికెట్టు అంటే రూ.50 కోట్లు పెట్టే పరిస్థితి వచ్చింది. టికెట్టు అడగాలంటేనే ఐదేళ్లు కష్టపడి పదికోట్లైనా ఖర్చు పెడితే ఎమ్మెల్యే స్థాయికి ఎదిగేది.. ఒక టికెట్టు కోసం పది మంది పోటీ పడి తలా పదికోట్లు పోగొట్టుకొని తీరా రాకపోతే ఏం చేస్తారు.. ఎవరూ చంపాల్సిన పనిలేదు.. వారికివారే ఆత్మహత్య చేసుకునే పరిస్థితి. ఇంతటి దుర్మార్గపు రాజకీయాలను ఎప్పుడూ చూడలేదు. గతంలో ప్రత్యర్థులుండేవారు.. ఇప్పుడలా కాదు మనకు మనమే ప్రత్యర్థులం.. ఈ రాజకీయాన్ని ఎంచుకోవడమే ఒక ఆత్మహత్య శరణ్యం.. ఇది ఒక రాజకీయ చదరంగం.. టైం బాగుండి టికెట్టువచ్చి గెలిస్తే అన్నీ బాగుంటాయి.. నూరు పనులు చేసి నూటొక్క పనిచేయకపోయినా అనరాని మాటలు, వినని బూతులు, పెట్టని శాపనార్థాలు పెట్టించుకోవాల్సి వస్తుంది. గెలిస్తే.. అట్ల ఇబ్బంది పడాలి.. టికెట్టు రాక, వచ్చినా గెలవకపోతే మదనమదనపడి చేసిన అప్పులు తీర్చుకోలేక ఇబ్బంది పడాల్సి వస్తుంది. గెలిచినా అదే.. గెలవకపోయినా అదే శిక్ష... అందుకే రాజకీయాల్లో ఆత్మహత్యలు తప్ప హత్యలుండవు అని సెలవిచ్చారు పెద్దలు.

హ్యాట్రిక్ సాధించిన కిరణ్‌కుమార్‌రెడ్డి



కిరణ్‌కుమార్ రెడ్డి

కలికిరి, ఏప్రిల్ 22: వాయల్పాడు, అనంతరం పునర్వ్యవస్థీకరించిన పీలేరు నియోజకవర్గాలకు సంబంధించి ఒకే ఒక్కరు మూడు పర్యాయాలు వరుసగా గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. ఆయనే మాజీ సీఎం, ప్రస్తుత రాజంపేట బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి. 1989 నుంచి రాజకీయాల్లోకి ప్రవేశించి అదే ఏడాది ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తరువాత 1994లో ఓడిపోయారు. అనంతరం 1999, 2004లో కూడా వాయల్పాడు ఎమ్మెల్యేగా గెలుపొందారు. తరువాత నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ జరగడంతో వాయల్పాడు బదులు పీలేరుగా పేరు మారింది. 2009లో కిరణ్‌కుమార్‌రెడ్డి మూడవసారి వరుసగా ఎన్నికయ్యారు. నియోజకవర్గ చరిత్రలో హ్యాట్రిక్ సాధించిన వ్యక్తిగా నమోదయ్యారు.

నాలుగో రోజు 44 నామినేషన్లు దాఖలు


నామినేషన్ దాఖలు చేస్తున్న పుట్టా సుధాకర్ యాదవ్

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 22: సార్వత్రిక ఎన్నికలకు సోమవారం నాలుగో రోజు జిల్లా వ్యాప్తంగా 44 నామినేషన్లు దాఖలయ్యాయి. కడప పార్లమెంట్ స్థానానికి 6, అన్ని నియోజకవర్గాల్లో 38 నామినేషన్లు దాఖలు చేశారు. కడప పార్లమెంట్ అభ్యర్థిగా రాయలసీమ రాష్ట్ర సమితి తరఫున ఆ పార్టీ వ్యవస్థాపకుడు కుంచం వెంకట సుబ్బారెడ్డి, జాతీయ కాంగ్రెస్ తరఫున వైఎస్ షర్మిలారెడ్డి, రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ వేణుగోపాల్, స్వతంత్ర అభ్యర్థిగా ఖాజా హుసేన్, ఇండిపెండింట్ అభ్యర్థిగా కుడముల వెంకటసుబ్బారెడ్డి నామినేషన్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయ రామరాజుకు సమర్పించారు. బద్వేలు నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా విజయజ్యోతి, వైసీపీ అభ్యర్థిగా డాక్టర్ సుధా, బీజేపీ అభ్యర్థిగా బొజ్జా రోశన్న కుమారుడు కార్తీక్ రోషన్, స్వతంత్ర అభ్యర్థిగా మద్దెల మల్లికార్జునరావు, కడప అసెంబ్లీకి శెట్టిపల్లి సుబ్రమణ్యం, షేక్ అలీషేర్, పట్టుపోగుల పవన్‌కుమార్, అవ్వారు మల్లికార్జున నామినేషన్లు దాఖలు చేశారు. కమలాపురం అసెంబ్లీ వైసీపీ అభ్యర్థిగా పి.రవీంద్రనాథ్ రెడ్డి రెండు సెట్లు, స్వతంత్ర అభ్యర్థిగా నర్రెడ్డి కిశోర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పాముల బ్రహ్మానందరెడ్డి, సీపీఐ అభ్యర్థిగా గాలి చంద్ర, పులివెందుల నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరుపున వైఎస్ మనోహర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. జైనేషనల్ పార్టీ తరుపున డి.రవిశంకర్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా గవిరెడ్డి రామేశ్వరరెడ్డి, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా బెల్లం ప్రవీణ్ కుమార్‌రెడ్డి, జమ్మల మడుగ వైసీపీ అభ్యర్థిగా డాక్టర్ సుధీర్ రెడ్డి 2 సెట్లు, ఇండిపెండింట్ అభ్యర్థిగా రామేశ్వరరెడ్డి, మూలే క్రాంతిప్రియ (వైసీపీ), ఇండిపెండింట్ అభ్యర్థిగా ప్రమోద్ కుమార్, సగబాల రామాంజనమ్మ, ఇండిపెండింట్ వెంకటసుబ్బారెడ్డి, ప్రొద్దుటూరు వైసీపీ అభ్యర్థిగా రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, బీఎస్పీ అభ్యర్థిగా పిచ్చేళ్ల సుబ్బరాయుడు, కాంగ్రెస్ అభ్యర్థిగా పూల నజీర్, చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ అభ్యర్థిగా సురేష్ బాబు, మైదుకూరు టీడీపీ అభ్యర్థిగా పుట్టా సుధాకర్ యాదవ్, పుట్టా రవికుమార్ యాదవ్(టీడీపీ), వైసీపీ అభ్యర్థిగా శెట్టిపల్లి రఘురామిరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా గుండ్లకుంట శ్రీరాములు, బీఎస్పీ నుంచి దాసరి జయరాం, స్వతంత్ర అభ్యర్థిగా ఆవుల వెంకటరమణ, బీఎస్పీ నుంచి కళ్యాణ్, జైభారత్ నేషనల్ పార్టీ లెక్కల శ్రీనివాసుల రెడ్డిలు నామినేషన్లు దాఖలు చేశారు.

ఎమ్మెల్సీ ఇస్తానని జగన్ మాటతప్పారు

అవమానాలు తట్టుకోలేక కాంగ్రెస్ గూటికి ● కడప కాంగ్రెస్ అభ్యర్థి అఫ్జల్‌ఖాన్



కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 22: వైసీపీ కష్టకాలం నుంచి 14 ఏళ్ల పాటు జగన్ వెంట నమ్మి నడిస్తే నన్ను ఆదరించలేదు.. ఈ ఐదేళ్లలో తాను ఎమ్మెల్యే అంజాద్‌బాషా సీఎంను కలవనీ యలేదు.. ఇక ముస్లిం మైనార్టీల మనోభావాలను దెబ్బతీసే విధానాలకు జగన్ మద్దతు పలకడంతో విసిగిపోయి, అవమానాలు తట్టుకోలేక పార్టీ వీడి కాంగ్రెస్ పార్టీలో చేరానని కడప నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి అఫ్జల్‌ఖాన్ స్పష్టం చేశారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనాదిగా తాను వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి విధేయుడినని అన్నారు. ఆయన మరణానంతరం తనయుడు జగన్‌తో కలసి పార్టీ కోసం పని చేస్తే 2009, 2014లో టిక్కెటు దక్కలేదు. ఎమ్మెల్సీ ఇస్తానని హామీ ఇచ్చి మాట తప్పారని ఆరోపించారు. సీఏఏ, ఎన్ఆర్‌సీ, తలాక్ బిల్లుల విషయంలో జగన్ మద్దతు పలకడం కలచి వేసిందన్నారు. ఐదేళ్లలో సీఎంను కలసి ముస్లిం, మైనార్టీల సమస్యలను తెలపాలని వేచి చూశా. డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా ముఖ్యమంత్రిని కలవకుండా చేశారని విమర్శించారు. 2000 నుంచి 2024 వరకు పాతికేళ్ల వైఎస్ కుటుంబానికి విధేయుడిగా నడిస్తే.. జగన్ ప్రభుత్వంలో నమ్మిన వాని కంటే.. నమ్మించే వాళ్లకు ప్రాధాన్యత, పదవులు ఉంటాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

టీడీపీ హయాంలో హజ్ హౌస్ నిర్మిస్తే ముస్లింల పక్షపాతిగా చెప్పే సీఎం జగన్ రూ.20కోట్లు కేటాయించక పోవడం శోచనీయమన్నారు. పవిత్ర హజ్‌కు వెళ్లే యాత్రికులకు ఆశ్రయం ఇచ్చే హజ్ భవన్ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందన్నారు. మైనార్టీ కార్పొరేషన్ ద్వారా యువతీ, యువకులకు ఉపాధి కోసం రుణాలిచ్చే పద్ధతికి చరమగీతం పాడారని, వక్ఫ్‌బోర్డు స్థలాలు అన్యాక్రాంతం అవుతుంటే చోద్యం చూస్తున్నారని, అమాయకులైన మైనార్టీలను అభివృద్ధికి దూరం చేశారని జగన్ పాలనపై విరుచుకుపడ్డారు. చివరికి సొంత చెల్లెలు షర్మిలకు అన్యాయం చేశారని, చిల్లర నేతలు వైఎస్ఆర్ గౌరవం దెబ్బతీసేలా కామెంట్లు చేస్తున్నా జగన్ స్వార్థ రాజకీయాల కోసం చర్యలు లేకపోవడం చూస్తే వైఎస్ కుటుంబం నమ్మిన బంటుగా బాధేస్తుందన్నారు. కాంగ్రెస్‌పార్టీలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని, అందుకే కడప కాంగ్రెస్ అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిని వైఎస్ షర్మిలమ్మను ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అఫ్జల్ ఖాన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు విష్ణు ప్రీతంరెడ్డి, పీసీసీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు అలీఖాన్, సలావుద్దీన్, ఎంపీ సురేష్, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుజాతారెడ్డి, మధురెడ్డి, పుల్లయ్య, లక్ష్మయ్య, బాబు, చంటి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి దారుణ హత్య

● దారి కాచి ఒకరిని.. ఇంటికెళ్లి మరొకరిని..

● హత్య చేసిన గుర్తుతెలియని వ్యక్తులు


హత్యకు గురైన వెంకటరాయుడు - మాబున్ని

చిన్నమండెం, ఏప్రిల్ 21: చిన్నమండెం మండలంలో సోమవారం రాత్రి దారుణం చోటు చేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తులు దారికాచి ఒకరిని, ఇంటికి వెళ్లి మరొకరని కత్తులతో విచక్షణా రహితంగా పొడిచి హత్య చేశారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. చిన్నమండెం మండలం దిగువగొట్టివీడు పంచాయతీలోని కమ్మపల్లెకు చెందిన రేషన్ డీలర్ చల్లపల్లె వెంకటరాయుడు(60) సోమవారం రాత్రి ద్విచక్రవాహనంలో వెళుతుండగా చాకిబండ, గొట్టివీడు మార్గమధ్యలోని పోలిమేరమ్మ గుడివద్ద ఆటోలో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు ఢీకొట్టారు. దీంతో కిందపడ్డ వెంకటరాయుడుపై కత్తులతో పొడిచి హత్య చేశారు. అనంతరం అక్కడికి మూడు కిలోమీటర్ల దూరంలోని ఎగువబలిజపల్లెకు చేరుకున్నారు. ఆ గ్రామంలో నివాసం ఉంటున్న మాబూన్ని (50)ని సైతం కత్తులతో పొడిచి చంపి వెళ్లిపోయారు. వీరిద్దరూ హత్యకు గురైన విషయం ఆలస్యంగా గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. చిన్నమండెం ఎస్ఐ రమేశ్‌బాబు, రాయచోటి రూరల్ సీఐ తులసీరాం, డీఎస్పీ మహబూబ్‌బాషా సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ విషయంపై డీఎస్పీని వివరణ కోరగా హత్యకు గల కారణాలు ఇంకా తెలియలేదని, దీనిపై విచారణ చేపడుతున్నామన్నారు. కాగా.. ఈ హత్యలకు పాతకక్షలు కారణమా.. లేక మరేవైనా కారణాలా అన్నది తెలియలేదు.

యువకుడు ఆత్మహత్య


షేక్ అల్తాఫ్ మృతదేహం

నందలూరు, ఏప్రిల్ 22: అరవపల్లె ఆర్ఎస్ రోడ్డులోని పోలీస్ స్టేషన్‌కు ఎదురు వీధిలో సయ్యద్ అల్తాఫ్ (22) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం చోటు చేసుకున్న సంఘటనపై సోమవారం ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ మాట్లాడుతూ తండ్రి బాషా సాహెబ్ మరణించడంతో తల్లి, కొడుకు ఇద్దరూ ఒకే ఇంట్లో ఉండగా మృతుడు సయ్యద్ అల్తాఫ్ తరచూ గొడవ పడుతుండడంతో తల్లి మందలించింది. దీంతో మృతుడు ఉరి వేసుకున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుండెకు, ఊపిరితిత్తులకు మధ్యలో బుల్లెట్లు

● అరుదైన శస్త్రచికిత్సతో ప్రాణాలు కాపాడిన రుయా వైద్యులు


బాధితుడి వివరాలు తెలియజేస్తున్న వైద్యాధికారులు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 22: గుండెకు, ఊపిరితిత్తులకు మధ్యలో శరీరంలోకి రెండు బుల్లెట్లు దిగిన ఓ వ్యక్తి ప్రాణాలను తిరుపతి రుయా ఆస్పతి వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి కాపాడారు సోమవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ రవిప్రభు మీడియాకు వివరాలు తెలిపారు. అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం పసలవాండ్లపల్లికి చెందిన విశ్వనాథ్‌పై కుటుంబ కలహాలతో సొంత అన్న నాటు తుపాకీతో కాల్చాడు. దీంతో విశ్వనాథ్ శరీరంలోకి రెండు బుల్లెట్లు దూసుకెళ్లాయి. బాధితుడిని కుటుంబీకులు 18వ తేదీన రుయా ఆస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షించగా గుండెకు, ఊపిరితిత్తులకు మధ్యలో రెండు బుల్లెట్లు ఉన్నాయని గుర్తించారు. వెంటనే కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ కళ్యాణి రమ ఆధ్వర్యంలో ఆధునిక పెరికాడియంలో పద్ధతిలో శస్త్రచికిత్స చేసి బుల్లెట్లను తొలగించారు. బాధితుడు పూర్తి ఆరోగ్యంగా కోలుకున్నాడు. ఇటువంటి సర్జరీ చేయడం సాధారణం విషయం కాదని, బుల్లెట్లను తొలగించే క్రమంలో ఒక్కోసారి రోగి ప్రాణాలు కూడా కోల్పోయే అవకాశం ఉందని సూపరింటెండెంట్ తెలిపారు. ఏఆర్ఎంఓ డాక్టర్ హరికృష్ణ, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 అరుణమ్మ, క్లినికల్ పర్ఫ్యూజనిస్టు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వేధింపులతో మూతపడిన మద్యం షాపులు

పోలీసుల వేధింపులు తట్టుకోలేక పనిచేయలేమంటున్న సేల్స్‌మెన్లు

లక్కిరెడ్డిపల్లె ఏప్రిల్21: మండలంలో రెండు బ్రాందీషాపులు ఉన్నాయని అందులో ఎన్నికల వేల రోజూ లక్షల రూపాయలు వ్యాపారం సాగుతోంది. అయితే సోమవారం ఉన్నట్టుండి మధ్యాహ్నం నుంచి బ్రాందీ షాపులు మూతపడ్డాయి. దీంతో మందుబాబులు షాపుల వద్ద తొక్కిసలాడారు. విషయానికి వస్తే రెండుషాపుల సేల్స్‌మెన్లను లక్కిరెడ్డిపల్లె పోలీసులు వేధిస్తున్నారని దీంతో స్టేషన్‌కు పిలిపించి దుర్భాలలాడారని సేల్స్‌మెన్లు వాపోయారు. మందుబాబులపై కేసులు నమోదు చేసేలా సహకరించాలని లేదంటే మీపై కేసులు బనాయిస్తామని పోలీసులు బెదిరించారని సేల్స్‌మెన్లు ఆరోపించారు. ప్రభుత్వ ధరలకు మద్యం విక్రయిస్తున్నామని వ్యక్తికి మూడు బాటిల్లు మాత్రమే ఇవ్వాలని నిబనంధనలు పాటిస్తూన్నా, ఎక్కువ ఇవ్వాలని పోలీసులు ఇబ్బందులు పెడుతున్నారని వివరించారు. షాపుల వద్ద పోలీసు ఇన్ఫార్మర్లు మమ్మలను వేధిస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు ఆదేశాలమేరకే ప్రభుత్వ ధరలకు మద్యం విక్రయిస్తున్నామని మాపై పోలీసులు ఆగ్రహం వ్యక్తం చేయడం సభబుకాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పోలీసుల వేధింపుల గురించి స్టేట్ బేవరేజ్ కార్పొరేషన్ కడప డీఎంకి విషయాన్ని తెలియజేసి మద్యంషాపులను మూసివేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ విషయం పోలీసుల తీరుపై ఎస్పీ క్రిష్ణారావుకు ఫోన్‌ద్వారా సమాచారాన్ని అందించామని సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐ విష్ణువర్ధన్‌ను వివరణ కోరగా లక్కిరెడ్డిపల్లె మద్యం షాపులు రెండింటిలోనూ మద్యం అధిక ధరలకు విక్రయిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని దీంతో రెండు మద్యం షాపుల వద్ద ఇన్ఫార్మర్ కానిస్టేబుల్స్ నియమించామని వారిని రోజూ ఇక్కడ షాపుల వద్ద మీకేం పని వెళ్లిపోండి అని సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్లు ఇన్ఫార్మర్లను బెదిరిస్తున్నారని తెలిపారు. దీంతో రెండుషాపుల సిబ్బందిని పిలిపించి మందలించాను అని ఎస్ఐ వివరణ ఇచ్చారు.

వైసీపీకి అంబటి క్రిష్ణారెడ్డి రాజీనామా

బీజేపీలో చేరేందుకు రంగం సిద్ధం ● తీవ్ర అన్యాయం చేశారని ఆరోపణ


సురేష్‌బాబుకు రాజీనామా పత్రం ఇస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 22: వైసీపీ ప్రభుత్వంలో వ్యవసాయ మాజీ ప్రధాన సలహాదారు, తిప్పలూరు సర్పంచి అంబటి క్రిష్ణారెడ్డి సోమవారం వైసీపీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. తన రాజీనామా పత్రాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబుకు సమర్పించినట్లు తెలిపారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాం నుంచి తాను పార్టీ అభివృద్ధికి కృషిచేసినట్లు తెలిపారు. జగన్‌పార్టీని వీడి చాలా మంది వెళ్లినా తాను మాత్రం జగన్ వెంటే ఉన్నానన్నారు. అయితే జిల్లా పరిషత్ చైర్మన్ పదవి కోసం తాను భారీగా డబ్బు పోగొట్టుకున్నట్లు తెలిపారు. ఆ పదవి ఇవ్వకుండా అన్యాయం చేశారన్నారు. ప్రభుత్వ వ్యవసాయ ప్రధాన సలహాదారునిగా నియమించారన్నారు. అయితే ఈవిషయంలో కూడా తనకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. అందరికీ పదవులు రెన్యువల్ చేసినా తన కు మొండిచేయి చూపారన్నారు. దీంతో అనేక సార్లు సీఎంను కలిసినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఎమ్మెల్యేను కాద ని ఎంపీ ఏమీ చేయడని, అలాగే ఎంపిని కాదని సీఎం కూడా ఇక్కడ కార్యకర్తలకు, నేతలకు ఏమీ చేయడం లేదన్నారు. తన పదవీ కాలం పొడగింపును అడ్డుకుంది ఎమ్మెల్యేనే అని ఆయన ఆరోపిస్తున్నాడు. త్వరలో తన రాజకీయ భవిష్యత్తుపై కార్యా చరణ ప్రకటిస్తానన్నారు. అయితే అతి త్వరలో ఆయన బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరనున్నట్లు విశ్వసనీయ సమాచారం. తిప్పలూరులో పట్టున్న నేత అంబటితో తిప్పలూరులో వైసీపీకి భారీ గండిపడే అవకాశం ఉంది.

నామినేషన్ కోసం జనసమీకరణ


పోరుమామిళ్ల, ఏప్రిల్ 22: ఎన్నికల నామినేషన్ కోసం అధికార పార్టీ జనసమీకరణ సేకరించేందుకు పోటీలు పడ్డారు. ఎక్కువ జన సమీకరణ చేసి మెప్పు పొందాలని అధికార పార్టీలో రెండు వర్గాలు పోటీ పడ్డాయి. సోమవారం బద్వేలులో అధికార పార్టీ అభ్యర్థి డాక్టర్ సుధ నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి వర్గం, అదనపు సమన్వయకర్త విశ్వనాథరెడ్డి వర్గం పోటీ పడ్డాయి. పోరుమామిళ్లలో ఎమ్మెల్సీ డీసీ వర్గం నామినేషన్‌కు వచ్చే వారికి రూ.300 నగదు, భోజనం ఏర్పాటు చేశారు. టౌన్‌లో అదనపు సమన్వయకర్త విశ్వనాథరెడ్డి వర్గీయులు రూ.500 నగదు, బిర్యాని బాక్స్‌లను అందజేశారు. ఒకే పార్టీలోని వారు వర్గాలుగా విడిపోవడంతో బలప్రదర్శనకు పోటీ పడాల్సి వచ్చింది.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు : తులసిరెడ్డి


అభ్యర్థితో ఆర్వో కార్యాలయానికి వస్తున్న తులసిరెడ్డి

మైదుకూరు, ఏప్రిల్ 22: రాష్ట్రంలోనూ, దేశంలోనూ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, జగన్ పాలనపై విసుగెత్తిపోయారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మెన్ నర్రెడ్డి తులసిరెడ్డి పేర్కొన్నారు. మైదుకూరు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా గుండ్లకుంట శ్రీరాములు నామినేషన్‌ను దాఖలు చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ చూసినా అవినీతి, అక్రమాలు దోపిడీలు జరుగుతున్నాయని, అభివృద్ధి ఏమాత్రం పట్టించుకోలేదని, దేశంలో కూడా బీజేపీ మతతత్వ పార్టీగా పేరొందిందన్నారు. అక్కడ బీజేపీ భూస్థాపితం అవుతుందని, రాష్ట్రం, కేంద్రంలోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తున్నదని ధీమా వ్యక్తం చేశారు.

టీడీపీ నేత గంప శివ ఇంట్లో పోలీసుల సోదాలు


టీడీపీ నేత దొంతం శివ ఇంట్లో సోదా చేస్తున్న పోలీసులు

రాజంపేట, ఏప్రిల్22: స్థానిక నూనెవారిపల్లె రోడ్డులో నివసించే టీడీపీ యువనేత, ప్రముఖ రియల్టర్ దొంతం శివ (గంప శివ) ఇంట్లో పట్టణ సీఐ మద్దయ్య ఆచారి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం సోదాలు నిర్వహించారు. ఎన్నికల సమయంలో కొందరు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బందితో కలిసి పట్టణ సీఐ మద్దయ్య ఆచారి, ఫ్లయింగ్ స్క్వాడ్ మహిళా అధికారి సుజామణి తదితరులు ఈ సోదాలో పాల్గొన్నారు. అతని స్వగృహంలో కోట్ల రూపాయలు డబ్బు దాచివున్నారన్న ఆరోపణతో ఈ సోదాలు నిర్వహించారని తెలిసింది. ఇంట్లో మొత్తం సోదాలు నిర్వహించారు. అయితే అతని ఇంట్లో ఎటువంటి నగదు దొరకకపోవడం వెనుదిరిగినట్లు తెలిసింది. ఈ విషయమై దొంతం శివను వివరణ కోరగా ఎవరో కావాలనే తనపై ఫిర్యాదు చేసి పోలీసుల చేత సోదాలు చేయించారని తమ ఇంట్లో ఎటువంటి నగదు దొరకకపోవడం వెనుదిరిగి వెళ్లారన్నారు. ఈ విషయమై పట్టణ సీఐ వివరణ కోసం అనేక సార్లు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు..

వైభవోపేతం వీరభద్రుడి పల్లకీ ఉత్సవం


వీరభద్రాలయంలో పల్లకీ ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, ఏప్రిల్22: దక్షిణకాశీగా పేరుగాంచిన భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్‌పర్సన్ పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల వేద మంత్రోచ్చారణల మధ్య భద్రకాళీ సమేత వీరభద్రుడు ఉత్సవ విగ్రహాలను అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంక రించి పల్లకీ ఉత్సవంపై ఆలయం చుట్టూ మాడవీధుల్లో ప్రదక్షిణలు నిర్వహించారు. పట్టణ భక్తులు, కన్నడ భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అర్చక స్వాములు ఆలయానికి వచ్చిన భక్తులందరికీ అర్చనలు చేసి తీర్థప్రసాదాలు అందించారు.

తూనికలు తేడా వస్తే చర్యలు తప్పవు

రైల్వేకోడూరు, ఏప్రిల్22: వినియోగదారులకు తూనికల కొలతల్లో తేడా జరిగితే కఠిన చర్యలు తప్పవని తూనికల శాఖ అధికారి రవీంద్రారెడ్డి హెచ్చరించారు. సోమవారం వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణంలోని మల్లెంకొండ పెట్రోలు బంక్‌లో తనిఖీ చేపట్టారు. పెట్రోలు బంక్‌పై వచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీ చేయడానికి వచ్చామన్నారు. తనిఖీల్లో తేడాలు కనిపిస్తే పెట్రోలు బంక్‌ను నిర్వహిస్తున్న యజమానిపై చర్యలు తీసుకుంటామని, జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

వైసీపీ సమావేశానికి పంచాయతీ ట్యాంకర్


వైసీపీ సమావేశం ప్రాంగణం వద్ద పంచాయతీ ట్యాంకర్

వాల్మీకిపురం, ఏప్రిల్ 22: తిరుపతి రోడ్డులో సోమవారం నిర్వహించిన వైసీపీ కార్యకర్తల సమావేశానికి పంచాయతీ నీటి ట్యాంకర్‌ను వాడుకున్నారు. కార్యకర్తల సమావేశం ప్రాంగణం వద్ద పంచాయతీ నీటి ట్యాంకర్ కనిపించడంతో వ్యవహారం జిల్లా అధికారుల దాకా వెళ్లింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో స్థానిక అధికారులు సైతం జిల్లా అధికారుల ఆదేశాలతో అప్రమత్తమయ్యారు. ఈ విషయమై ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డిని వివరణ కోరగా సమావేశం ప్రాంగణం వద్ద పంచాయతీ ట్యాంకర్‌ను గమనించి అప్పటికప్పుడే తొలగించామన్నారు.

ప్లాస్టిక్‌తో మానవాళి మనుగడకు దెబ్బ


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న జ్ఞానాంబిక విద్యార్థులు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 22: మానవాళి మనుగడను ప్లాస్టిక్ వినియోగం ఎక్కువగా దెబ్బతీస్తోందని పేస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వీఎస్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల, పేస్ సంస్థ సంయుక్తంగా మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ సౌజన్యంతో నిర్వహించిన ధరిత్రి దినోత్సవంలో భాగంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్ వినియోగం తగ్గిద్దామని నినాదాలు చేశారు. కోమటివానిచెరువు కట్టపై మొలచిన పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పేస్ సంస్థ నిర్వాహకుడు ఉత్తమేశ్వరరావు, ప్రిన్సిపాల్ రమాదేవి మాట్లాడుతూ ,పదేళ్లతో పోలిస్తే వేసవిలో ఎండలతో భూతాపం పెరిగి 45 డిగ్రీల సెంటిగ్రేడ్ ఆరెంజ్ సిగ్నల్ ఇస్తున్నారన్నారు. ఇదే కొనసాగితే మనుషులు బయట కూడా తిరగలేరన్నారు. విద్యార్థులకు ప్లాస్టిక్ వ్యర్థాల ప్రభావం అనే అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు రూ.10 వేలు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, డాక్టర్ రమ్య, అధ్యాపకులు రెడ్డెప్ప, మునీంద్రనాయక్, శరత్, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళపై మూకుమ్మడి దాడి

రామసముద్రం, ఏప్రిల్ 22: మహిళపై మూకుమ్మడి దాడి జరిగిన సంఘటన రామసముద్రంలో సోమవారం వెలుగు చూసింది. మండలంలోని దిన్నెమీద హరిజనవాడ వాసి జి.కవిత భర్త వేధింపులతో రెండు రోజుల కిందట పీటీఎంలోని పుట్టింటికి వెళ్లింది. పిల్లల బట్టలు, ఆధార్ కార్డు తీసుకురావడానికి దిన్నెమీదహరి జనవాడకు ఆదివారం వచ్చింది. దీనిని జీర్ణించు కోలేని కుటుంబీకులు రెచ్చిపోయి కవితను ఇంట్లో బంధించి మూకుమ్మడిగా దాడి చేసి చిత్రహింసలకు గురి చేశారు. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన బాధితురాలు నిద్ర మాత్రలు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. 108 సిబ్బంది ఆమెను అడ్డుకుని ఆస్పత్రికి తరలించారు. బాధితురాలు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చింతపర్తి పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

వాల్మీకిపురం, ఏప్రిల్ 22: చింతపర్తి పీహెచ్‌సీని సోమవారం జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వేణుగోపాల్‌రావ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ల్యాబ్ పరిశీలించి రికార్డులు చూస్తూ డెంగ్యూ పరీక్షలు మరింత పెంచాలని సూచించారు. వేసవిలో వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు సన, ఆయేషా, శ్రీవిద్య, నాగభూషణం, సబ్ యూనిట్ ఆఫీసర్ ముజీబ్‌బాషా, హెల్త్ సూపర్‌వైజర్లు సుధాకర్, భాను, సీహెచ్ఓ ఇందిరారాణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కమనీయం.. పట్టాభిరాముడి కల్యాణం

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 22: కందుకూరు గ్రామంలో వెలసిన పట్టాభిరాముడి కల్యాణోత్సవం సోమవారం కమనీయంగా సాగింది. భక్తులకు సింహవాహనంపై స్వామి వారు దర్శనం ఇచ్చారు. సాయంత్రం పట్టాభిరాముల కల్యాణోత్సవాన్ని రాములవారి తరపున కందుకూరుకు చెందిన కరణం ప్రకాష్‌రావ్, కరణం అభిరాం, కరణం సాంబశివరావ్, సుధాకర్‌రావ్, కరణంరామచంద్రరావ్, పాల్గొనగా సీతమ్మవారి తరుపున నరకూరి అఖిల, క్రిష్ణచైతన్య పాల్గొన్నారు.

'వైసీపీ పాలనలో అన్నీ కష్టాలే'

● శ్రీనివాసరెడ్డి, మాధవీరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 22: వైసీపీ పాలనలో అన్నీ కష్టాలేనని టీడీపీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం కడప నగరం 21 డివిజన్ ఎర్రముక్కపల్లెలో భారీగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానికులు అధిక సంఖ్యలో టీడీపీలో చేరారు. వారికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి టీడీపీ కండువావేసి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్. గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సుధా దుర్గ ప్రసాద్, టీడీపీ నాయకులు అప్సర్‌ఖాన్, మోహన్, శివకొండారెడ్డి, శివశంకర్‌రెడ్డి, జిలాని, తిరుమలేష్, రంజిత్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

35వ డివిజన్‌లో...

కడప నగరం 35వ డివిజన్‌లో దుబాయ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల నుంచి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి .ఆర్ మాధవీరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు మన్సూర్, జావేద్, వాసింఖాన్, సయ్యద్ మస్తాన్‌వలి, సాధిక్‌హుసేన్, అస్లాంభాషా, రాఘవ, లింగారెడ్డి, అమిద్ బుకారి పాల్గొన్నారు.

రానున్నది తెలుగుదేశం పాలనే : బీటెక్ రవి

పులివెందుల టౌన్, ఏప్రిల్ 22: లింగాల మండలం రామట్లపల్లెకు చెందిన మరో ఐదు కుటుంబాలు సోమవారం టీడీపీలో చేరాయి. గత మూడురోజుల కిందట రామట్లపల్లెకు చెందిన పలు కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్న సంగతి తెలిసిందే. సోమవారం పులివెందుల పార్టీ కార్యాలయంలో పులివెందుల అసెంబ్లీ అభ్యర్థి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) సమక్షంలో శివార్జున, శివగోపాల్, శివ కుళాయప్ప, చిన్న నరసింహులు, శివశంకర్ పార్టీలో చేరారు. టీడీపీ గెలుపునకు కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సంజీవరెడ్డి, విశ్వనాథరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయండి

పెండ్లిమర్రి, ఏప్రిల్ 22: రాష్ట్ర భవిష్యత్తు, పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేయాలని కడప పార్లమెంట్ అభ్యర్థి భూపేష్‌రెడ్డి కోరారు. సోమవారం మండలంలోని పాత సంగటిపల్లె గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టోను వివరించారు.

10 కుటుంబాలు టీడీపీలో చేరిక

మండలంలోని ఇసుకపల్లె పంచాయతీలోని కొత్తపేట గ్రామంలో నియోజకవర్గ యువనాయకులు పుత్తా చైతన్యరెడ్డి, పుత్తా లక్ష్మిరెడ్డిల ఆధ్వర్యంలో సిద్దారెడ్డి సమక్షంలో పది కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. మండల టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి, మండల క్లస్టర్ ఇన్‌చార్జి కిషోర్‌రెడ్డి, టీడీపీ నేతలు రామనందరెడ్డి, నాగమల్లారెడ్డి, రఘు, చంద్రాయుడు, బయన్న, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కడప: డప్పు మోగిస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి



పెండ్లిమర్రి: పార్టీలో చేరిన వారితో పుత్తా చైతన్యరెడ్డి, లక్ష్మీరెడ్డి

టీడీపీ అభ్యర్థులను గెలిపించండి

వేముల, ఏప్రిల్ 22: పులివెందుల అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బీటెక్ రవి, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న భూపేష్‌రెడ్డిలను గెలిపించండి.. మళ్లీ రామరాజ్యాన్ని సాధిద్దామని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేర్ల పార్థసారథిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండలంలో ఇంటింటికి ఎన్నికల ప్రచారానికి వచ్చిన బీటెక్ రవి, భూపేష్‌రెడ్డిలకు పార్థసారథిరెడ్డి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్థసారథిరెడ్డి మాట్లాడుతూ ఒక్కసారి పులివెందుల నియోజకవర్గంలో టీడీపీ వారికి కూడా అవకాశం ఇవ్వండి అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామన్నారు. మీరు చేసిన అభివృద్ధి కంటే రెట్టింపు అభివృద్ధి చేయకపోతే ఇంకా ఎప్పుడేగాని మాకు ఓటు వేయొద్దని ప్రజలను కోరారు. అంతకుముందు ప్రచారానికి చేసిన అభ్యర్థులను ఇరువురికి పార్థసారథిరెడ్డి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వేముల ప్రచారంలో బీటెక్ రవి, భూపేష్‌రెడ్డి

మాజీ సైనికుల సంక్షేమానికి కృషి చేయాలి

నాగరాజుపేట, ఏప్రిల్ 22: దేశ సరిహద్దుల్లో నిరంతరం పోరాటం చేసినటువంటి మాజీ సైనికుల సంక్షేమానికి కృషి చేయాలని ఉమ్మడి రాష్ట్రాల జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ రాజేష్‌మనోజ్ పేర్కొన్నారు. సోమవారం కడప మిలిటరీ ఆసుపత్రి నందు జీఓసి సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాల సైనిక సంఘం మిలటరీ ఆసుపత్రి యొక్క మార్కెట్ వ్యాల్యూషాన్ని అనుకూలంగా పెంచి ఎంప్లైనర్‌మెంట్ ఆసుపత్రిని మరింత మెరుగుపరచాలన్నారు. మాజీ సైనికుల పెన్షన్‌లకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా ఒక కౌంటర్‌ను అధికారికంగా నిర్వహించేందుకు త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే ర్యాలీ ద్వారా సైనికుల సంక్షేమ మార్గం ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు మరింత మెరుగు పరచి మాజీ సైనికులకు ఉపయోగపడేటట్లు చేయాలన్నారు. మాజీ సైనికుల సమస్యలపై అర్జీలను సైతం ఆయన స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ వి. లక్ష్మీనారాయణ, జనరల్ సెక్రటరీ గోపాల్‌రెడ్డి, ట్రెజరర్ పి. కేశవరామ్‌సింగ్ పాల్గొన్నారు.

శ్రీచైతన్య విజయకేతనం

వేంపల్లె, ఏప్రిల్ 22: పదవ తరగతి పరీక్ష ఫలితాలలో వేంపల్లె శ్రీచైతన్య విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి తెలిపారు. 169 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. అందులో చెన్నకేశవ 595, ఉదయ్‌తేజరెడ్డి 593, లిఖిత్ 593, మనోజ్ఞ 592, సునీత్ 590 మార్కులు సాధించారన్నారు. 500కు పైగా మార్కులు 152 మంది సాధించినట్లు తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి

ఉషాకిరణ్ పాఠశాలలో...

పదవ గరతి పరీక్ష ఫలితాలలో వేంపల్లె ఉషాకిరణ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించినట్లు కరస్పాండెంట్ రమణారెడ్డి తెలిపారు.అందులో 114 మంది పరీక్షలు రాయగా వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కల్లూరు మనోజ్ఞ 588, వి.జన్విత 585, తనుశ్రీ 584, భవిత 584 మార్కులు సాధించారన్నారు. 580కి పైగా మార్కులు పది మంది విద్యార్థులు సాధించారన్నారు.



విజయకేతనం చూపుతున్న కరస్పాండెంట్ రమణారెడ్డి

నారాయణ ప్రభంజనం

పదిలో వేంపల్లె నారాయణ ఉన్నత పాఠశాల ప్రభంజనం సృష్టించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ నారాయణరెడ్డి తెలిపారు. 92మంది పరీక్షలకు హాజరుకాగా వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. భవ్యశ్రీ 592, చంద్రహాసిని 591 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచారన్నారు. 500కుపైగా మార్కులు 74మంది విద్యార్థులు సాధించారన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న నారాయణరెడ్డి

మత సామరస్యానికి ప్రతీక ఉరుసు

కమలాపురం రూరల్, ఏప్రిల్ 22: మత సామరస్యానికి ఐక్యతగా దర్గా ఏ గఫారియ ఉరుసు నిలుస్తోంది. కమలాపురం పట్టణంలో వెలసిన ఈ దర్గా భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. కమలాపురం దర్గా ఉరుసు మహోత్సవం సందర్భంగా మంగళవారం గంధం మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. నగర పంచాయతీ పరిధిలోని పడమటి వీధిలో ఉన్న గంధం ఊరేగింపుగా మేళతాలాలతో, బాణ సంచాపేలుస్తూ పక్కీర్ల విన్యాసాలచే దర్గాకు చేరుకుంటారు. అనంతరం దర్గాలోని మజారులు సమర్పిస్తారు. గంధం, కవ్వాలి పోటీలు నిర్వహిస్తారు.



హజరత్ అబ్దుల్ గఫార్‌షా దర్గా

టీడీపీ జిల్లా బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్‌గా జనార్దన్

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 22: టీడీపీ అధినేత చంద్రబాబు జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆదేశాల మేరకు బ్రాహ్మణ సాధికార సమితి జిల్లా కన్వీనర్‌గా జనార్దన్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు కె. అచ్చెన్నాయుడు సోమవారం ఒక ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే కడప నగర కన్వీనర్‌గా వెల్లూరి అజయ్‌శర్మను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

పట్టుదలతో చదివితే విజయం తథ్యం

కడప (మారుతీనగర్) ఏప్రిల్ 22: సివిల్ సర్వీసెస్ పట్ల అంకితభావం, పట్టుదలతో చదివితే విజయం సాధించడం తథ్యమని ఎఎస్పీ లోసారి సుధాకర్ అన్నారు. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ విభాగ పరీక్షలో విజేతలుగా నిలిచిన మర్రిపాటి నాగభరత్ (ర్యాంక్ నెంబర్ 580) కన్నెబోయిన శ్రీనివాసులు (526) వి.ధనుంజయకుమార్ (810)లను ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రమణ సారథ్యంలో సోమవారం స్థానిక ఆ అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో విజేతలకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సుధాకర్ హాజరై దేశం కోసం నాణ్యమైన సేవలు అందించేందుకు వీలుగా వచ్చిన అవకాశాన్ని చక్కగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తద్వారా దేశ ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్, కార్యదర్శి అనిల్‌కుమార్, ట్రెజరర్ బాల రాజశేఖర్, అసోసియేట్ ప్రెసిడెంట్ బాబు మోజెస్, వైవీయూ ప్రొఫెసర్స్ వినోదిని, మెర్సీ విజేత, అనుప్రసన్న, గంగయ్య, డాక్టర్ లక్ష్మీప్రసాద్, వై.సుబ్బరాయుడు, డాక్టర్ విజయ్‌కుమార్, ఎం.నాగరాజు, వేణుగోపాల్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శంకర్, అగ్రికల్చరల్ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు అభ్యుదయ గీతాలపై ఉచిత శిక్షణ

కడప (కల్చరల్), ఏప్రిల్ 22: కడప బాలోత్సవ్ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీ బుధవారం నగర మున్సిపల్ కార్పొరేషన్ మెయిన్ హైస్కూల్‌లో బాల, బాలికలకు ఉచిత చిత్రలేఖనం, అభ్యుదయ గీతాల పట్ల ఉచిత శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణి తెలిపారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో అందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఇందులో జూనియర్స్ విభాగంగా 3వ తరగతి నుంచి 5వ తరగతి వరకు, సీనియర్స్ విభాగంలో 5వ తరగతి నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులు పాల్గొనవచ్చున్నారు.



ఆర్కేఎం స్ట్రీట్ శ్రీరాముల బజార్‌లో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న తుంగా రమణయ్య, అఖిలా ఫ్యాషన్స్ మల్లి, సాయినాథ మ్యాచింగ్ సెంటర్ నారాయణ, సరస్వతి డ్రెస్ మెటీరియల్ శ్రీధర్

'పది'లో ప్రైవేటు పాఠశాలల హవా

సాయిబాబా విజయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న సాయిబాబా విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ సాయి సుధీర్‌కుమార్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 22: పదవ తరగతి పరీక్షా ఫలితాలలో సాయిబాబా విద్యార్థులు విజయభేరి మోగించారని ఆ విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ ఎంవీ సాయి సుధీర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. షేక్ మహమ్మద్ సిద్దిక్ 593 మార్కులు, మంచా వెంకటసాయి యశ్వంత్ 592, పోలు గీత 591, ప్రణయ భాస్కర్‌రెడ్డి 591 మార్కులు సాధించారన్నారు. అలాగే 590 పైగా మార్కులు నలుగురు విద్యార్థులు, 580కి పైగా 10 మంది, 550కి పైగా 47 మంది, 500 పైగా మార్కులు 80 మంది విద్యార్థులు సాధించారన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు వైస్ ఛైర్మన్ అభినంధనలు తెలియజేశారు.

బాలవికాస్ విజయ పరంపర



విద్యార్థులను అభినందిస్తున్న బాలవికాస్ సుబ్బరాయుడు, గంగయ్య

పది పరీక్షల్లో బాలవికాస్ హైస్కూల్ విద్యార్థులు విజయ పరంపర మోగించారని పాఠశాల కరస్పాండెంట్ సుబ్బరాయుడు తెలిపారు. 155 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 151 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ప్రథమ శ్రేణిలో ఒకరు, ద్వితీయ శ్రేణిలో ముగ్గురు, తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణులు అయ్యారన్నారు. విద్యార్థులను ఆయనతో పాటు గంగయ్య అభినందించారు.

'లిటిల్ ఫ్లవర్' ఘన విజయం

కడప నగరం లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ విద్యార్థులు పది ఫలితాల్లో ఘన విజయం సాధించారని పాఠశాల ఛైర్మన్ చంద్రమౌళి రెడ్డి, డైరెక్టర్ ఎ.రాజరెడ్డి తెలిపారు. పి.నాగ హరిత 586 మార్కులు, ఎస్.పావని 573, ఎ.సోహిత్ కుమార్ రెడ్డి 564 మార్కులు సాధించారన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది.



విద్యార్థిని అభినందిస్తున్న చంద్రమౌళిరెడ్డి, రాజారెడ్డి

చరిత్ర సృష్టించిన 'నారాయణ ఈ-టెక్నో'



విద్యార్థిని సఫియాను అభినందిస్తున్న నారాయణ యాజమాన్యం

పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో రాజారెడ్డి వీధి నారాయణ ఈ టెక్నో పాఠశాల విద్యార్థులు చరిత్ర సృష్టించారని జిల్లా ఏజీఎం బి. చెన్నకేశవరాజు తెలిపారు. ఎస్.సఫియా 597మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచారని చెప్పారు. విద్యార్థులను జిల్లా డీజీఎం రామ్‌మోహన్‌రెడ్డి, డీన్ చంద్రకిశోర్‌రెడ్డి ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌లు అభినందించారు.

'సిద్ధార్థ' విజయ కేతనం

కడప నగరం సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని పాఠశాల డైరెక్టర్ లక్ష్మయ్య తెలిపారు. సనా కౌసర్ 570 మార్కులు, అమ్రిన్ 568 సాధించారని చెప్పారు. విద్యార్థినిలను డైరెక్టర్ అభినందించారు.



విద్యారులను అభినందింస్తున్న పాఠశాల డైరెక్టర్ లక్షుమయ్య

వికాస్‌లో హైస్కూల్ 100 శాతం ఉత్తీర్ణత

కడప నగరం ఐటీఐ సర్కిల్ వికాస్ హైస్కూల్ విద్యార్థులు పది పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించారని కరస్పాండెంట్ వికాస్ హరికృష్ణ తెలిపారు. బి.హర్షితారెడ్డి 592 మార్కులు, ఎన్. లక్ష్మి లహరి 581 మార్కులు సాధించారన్నారు. విద్యార్థులను కరస్పాండెంట్ అభినందించారు.



విద్యార్థినిని అభినందిస్తున్న కరస్పాండెంట్ వికాస్ హరికృష్ణ

పవన్ స్కూల్ ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ లెక్కల జోగిరామిరెడ్డి

కడప నగరం అక్కాయపల్లెలోని పవన్ హైస్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని పాఠశాల కరస్పాండెంట్ లెక్కల జోగి రామిరెడ్డి తెలిపారు. కె.దీపక్‌రెడ్డి 589 మార్కులు, ఎస్.నవ్యశ్రీ 582 మార్కులు, ఎస్. అబ్దుల్ అజీజ్ 580 మార్కులు సాధించారన్నారు. పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత నమోదైందని చెప్పారు.ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను అభినందించారు.

నాగార్జున మోడల్ స్కూల్ విజయదుందుభి



నాగార్జున మోడల్ స్కూల్ విద్యార్థులు రెహన, ఐమాన్, దీపిక

నాగార్జున మోడల్ స్కూల్ విద్యార్థులు పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో విజయ దుందుబి మోగించారని విద్యాసంస్థల ఛైర్మన్ ఎం.శివశంకర్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీదేవి తెలిపారు. ఆర్. సహనా 553 మార్కులు, టి. వెంకటదీపిక 592, నిఖిల్ 592 అఫ్రాఐమాన్, ప్రజ్ఞ 591, గీతికా నందన్ 590 మార్కులు సాధించారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపల్ కృష్ణవేణి, హెడ్‌మాస్టర్ భాషా, వీరశివలు అభినందించారు.


నాగార్జున హైస్కూల్ విజయఢంకా




పదిలో మెరిసిన నాగార్జు మోడల్ స్కూల్ విద్యార్థులు


2024 సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో కడప నగరం నాగార్జున హైస్కూల్ విద్యార్థులు విజయఢంకా మోగించారని ఆ పాఠశాల కరస్పాండెంట్ శివతులశమ్మ తెలిపారు. ఎస్.అనుస్వరూప 588 మార్కులు, బి. కృష్ణచైతన్య యాదవ్ 579 లక్ష్మీధర్మతేజ, 576 జోషఫ్ సుశీల్, 575, కౌషర్ కానమ్ 574, ధమరేష్, 572 మార్కులు సాధించారన్నారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ అభినందించారు.

ఎస్‌వీఆర్ విజయదుందుభి



కడప నగరం ఎస్‌వీఆర్ హైస్కూల్ విద్యార్థులు విజయదుందుభి మోగించారని పాఠశాల కరస్పాండెంట్ ఆవుల సుధాకర్ తెలిపారు. వి.నవ్యా 567 మార్కులు, ఎ.వెంకట జ్యోష్న 529, ఆదిత్య 520 మార్కులు సాధించారన్నారు. పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత లభించిందని చెప్పారు.





వేలాడుతున్న విద్యుత్ తీగెలతో భయం.. భయం

సీకేదిన్నె, ఏప్రిల్ 22: విద్యుత్తు తీగెలను కరెంటు స్తంభాలపై మనుషులకు అందనంత ఎత్తులో బిగించి ఎలాంటి ప్రమాదం లేకుండా చేస్తారు. అయితే కొన్ని చోట్ల విద్యుత్తు వైర్లు కిందికి వేలాడుతూ తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. అయినప్పటికి అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతూనే ఉన్నారు. చింతకొమ్మదిన్నె మండలం కొప్పర్తి పంచాయతీ ఎర్రమాచుపల్లె గ్రామంలో ఓవీధిలో విద్యుత్తు లైన్లు కిందికి వేలాడుతుండటంతో జనం తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. వీధిలో ఉత్సవాలు జరిగేటేప్పుడు గ్రామోత్సవాలు నిర్వహిస్తుంటారు. అటువంటి సమయంలో గతంలో అనేకసార్లు ప్రమాదాలు జరిగినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.



వేలాడుతున్న విద్యుత్తు తీగెలు



రాజకీయ కురువృద్ధుడు.. అభివృద్ధిలో మేరునగ ధీరుడు. వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఉన్నా.. ప్రొద్దుటూరు అభివృద్ధే అజెండాగా ఉన్నవాడు. ప్రతిపక్షంలో ఉన్నా.. ప్రొద్దుటూరులో రాచముల్లుగా మారిన అధికార పార్టీనేతల ఆగడాలను ప్రశ్నించడానికే అందరూ వెనుకాడుతున్న తరుణంలో.. ఆయనకు ఎదురొడ్డి పోరాడుతున్న వ్యక్తి.. బీసీ సమస్యలపై.. ముస్లింల ఇబ్బందులపై స్వరం వినిపించారు. అంగన్వాడీలకు అండగా నిలిచారు. రైతాంగం కోసం పాటుపడుతున్నారు. వైసీపీ అరాచకాలను అంతం చేసేందుకు ఎన్నికల బరిలో దిగుతున్నాడు.. ప్రొద్దుటూరులో అవినీతిని అంతం చేయడం.. పసుపు జెండా ఎగరేయడమే తన లక్ష్యమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి ప్రకటిస్తున్నారు.

- అవినీతి అంతు చూడటమే నాలక్ష్యం
- అరాచకాలు దౌర్జన్యాలకు చెక్‌పెడతాం
- మట్కా, జూదం క్రికెట్ బెట్టింగ్‌లను అణిచివేస్తాం
- పాతికేళ్ల పాలనలో అభివృద్ధి సాధించాం
- రైతుల కష్టాలను ఎరిగిన వాడిని
- కుందూ-పెన్నా వరదకాలువ పూర్తి చేస్తాం
- చేనేత బతులకు భరోసా కల్పిస్తాం
- స్వేచ్ఛా వ్యాపారాలు సాగేలా చూస్తాం
- ఇసుక, భూదందాలు, సెటిల్‌మెంట్లను సాగనివ్వం
- పంచాయతీలను ఆర్థికపరిపుష్టిగా మార్చుతాం
- ప్రొద్దుటూరును కార్పొరేషన్‌గా మార్చుతాం
- భవిష్యత్తు తరాలు మెచ్చేలా అభివృద్ధి చేపడతాం
- ప్రొద్దుటూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరదరాజులరెడ్డి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



ప్రొద్దుటూరులో టీడీపీ జెండా ఎగురవేస్తాం

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 22: కడప జిల్లాలోనే రాజకీయ కురువృద్ధుడుగా.. బద్వేలు వీరారెడ్డి తరువాత పెద్దాయనగా పిలవబడే నాయకుడు నంద్యాల వరదరాజులరెడ్డి. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ఏకధాటిగా ఐదుసార్లు (1985-2009) ఎమ్మెల్యేగా తిరుగులేని రాజకీయ ఆధిపత్యం చెలాయించిన రాజకీయ దురంధరుడు వరదరాజులరెడ్డి. ఎంవీ రమణారెడ్డిలాంటి మేధావి, రాయసీమ ఉద్యమకారుడు, ఫ్యాక్షనిస్టును సైతం ఎదిరించి నియోజకవర్గంలో పాతికేళ్లపాటు ఏకచత్రాధిపత్యం నడిపిన రాజకీయ ఉద్ధండుడు వరదరాజులరెడ్డి. ప్రొద్దుటూరు అంటే బాంబులు, కూనీలకు పేరు గాంచిన దగ్గర నుంచి.. ప్రశాంతతకు మారుపేరుగా మార్చారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి ముఖ్య అనుయాయుడుగా వైఎస్ నోట అన్నా అని గౌరవంగా పిలవబడే వ్యక్తిత్వం నింపుకున్న పెద్దమనిషి ఆయన. వైఎస్ మరణం తరువాత ఆయన 2014 వరకు కాంగ్రెస్‌లో కొనసారు. తెలంగాణ విభజన తరువాత ఆయన కాంగ్రెస్‌ను వీడి 2014లో టీడీపీలో చేరి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేశారు. శిష్యుడైన వైసీపీ అభ్యర్థి రాచమల్లు ప్రసాద్ చేతిలో ఆయన ఓడిపోయారు. అయినా ఇప్పటికి నియోజకవర్గంలోని ప్రతిపల్లె ప్రతి వార్డులో అనుచరవర్గం కలిగివున్న ప్రజా నాయకుడు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ప్రతిపల్లెకు రోడ్లు వేసి విద్యుత్, తాగునీటి వసతి కల్పించారు. కుందూ పెన్నానదులపై హైలెవెల్ లోలెవెల్ వంతెనలు నిర్మించారు. ప్రొద్దుటూరులో ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి అంతా ఆయన హయాంలో జరిగినదే. దాదాపు మూడు దఫాలుగా ఓడిపోయినా.. 15 ఏళ్లగా ఆయన ఎమ్మెల్యే కాకపోయినా ఆయన రాజకీయ ఆధిపత్యం చెక్కుచెదలేదు.

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే రాచమల్లు అరాచకాలు, దౌర్జన్యాలు, ఇసుక, భూదందాలు హత్యారాజకీయాలకు ప్రజలు భయోత్పాతానికి గురయ్యారు. ఎమ్మెల్యే ఆయన బావమరుదుల గురించి విమర్శించాలన్నా బహిరంగంగా మాట్లాడలేని భయానక రోజులు అనుభవించారు. ఇప్పటికీ రాచమల్లు భయం గుప్పిట్లలోనించి అన్నివర్గాలు ఇంకా స్వేచ్ఛగా బయటికి రాలేని పరిస్థితి నెలకొనివుంది. అభివృద్ధి జపం పేర రాచమల్లు మాటల గారడీలకు జనం విసుగుచెందారు. అందుకే మార్పు కోరుకుంటున్నారు. వరదరాజులరెడ్డిని 80 ఏళ్ల పైబడిన వయస్సులో క్రియాశీల రాజకీయాల్లోకి రావాలని ప్రజలు వివిధ వర్గాలు ఆహ్వానించాయి. అందులో బాగంగానే టీడీపీలో టికెట్టుకు తీవ్ర పోటీ నెలకొన్నప్పటికీ ప్రజాసర్వేలన్నీ ఆయనకు ముక్తకంఠంతో మద్దతు తెలిపాయి. దీంతో ఆయనకు స్వచ్ఛందంగా టికెట్టు లభించింది. ఇంక ప్రొద్దుటూరులో టీడీపీ విజయం ఖాయమని ప్రజల్లో తేలిపోయింది. పెద్దాయన ముదిమి వయసులో ఆయన సుదీర్ఘ అనుభవంతో మలిదశ ప్రొద్దుటూరు రాజకీయాలను శాసించనున్నారు. ఎమ్మెల్యేగా గెలిచాక ప్రొద్దుటూరుకు ఏమి చేయనున్నారో ఆయన వివరించారు.

మట్కా, బెట్టింగ్ బంద్ చేయిస్తాం

ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే రాచమల్లు నిర్వహిస్తున్న మట్కా గుట్కా, జూదం, మద్యం, క్రికెట్ బెట్టింగ్ లాంటి అసాంఘిక కార్యకలాపాలన్నీ బంద్ చేయిస్తాం. అలాంటి వారిని నగర బహిష్కరణ చేస్తాం.

ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకుంటాం

ప్రొద్దుటూరు నియోజకవర్గంలో వైసీపీ ఐదేళ్ల పాలనలో భూ ఆక్రమణలు పెరిగాయి. ప్రభుత్వ భూములు, ఇరిగేషన్ కాలువలు, కుంటలు.. ఆఖరుకు దేవాలయ భూములను కూడా వైసీపీ వారు కబ్జా చేశారు. మేము అధికారంలోకి రాగానే కబ్జాదారుల నుంచి ఇవన్నీ స్వాధీనం చేసుకుంటాం.

ఇసుక, భూదందాలు సాగనివ్వం

చరిత్రలో ఎన్నడూలేని విధంగా ప్రొద్దుటూరులో ఇసుక, భూదందాలు, సెటిల్‌మెంట్లు జరిగాయి, వందల కోట్లు అక్రమంగా ఐదేళ్లలోనే సంపాదించారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఇసుక అక్రమ రవాణాతో పాటు భూదందాలపై ఉక్కుపాదం మోపుతాం. ప్రజల భూములను ఆస్తులను పరిరక్షిస్తాం.

అవినీతి అంతు చూడటమే లక్ష్యం

వైసీపీ పాలనలో ప్రొద్దుటూరులో రెవెన్యూ, పోలీసు, సబ్‌రిజిస్ట్రార్, మున్సిపాలిటీ, పంచాయతీలను అవినీతి నిలయాలుగా మార్చారు. ప్రతి కార్యాలయం నుంచి నెల మామూళ్లు తీసుకుని ప్రజా సేవకు వ్యాపారంగా మార్చారు. అవినీతి ఏరూపంలో ఉన్నా అంతుచూస్తాను. పారదర్శక పాలన ప్రజలకు అవినీతి రహిత సేవలు అందిస్తాం.

శాశ్వత తాగునీటి సౌకర్యం

అమృత్ పథకం ఉన్నప్పటికి గండికోట నుంచి మైలవరం జలాశయానికి నీళ్లు వచ్చినప్పుడే పైపులైను ద్వారా నీళ్లు తీసుకురాగలం. అదే కుందూ-పెన్నా వరదకాలువ తీసుకొచ్చుకుంటే ప్రతిఏడాది వరదనీళ్లు పెన్నానదిలోకి పారించి ప్రొద్దుటూరు జనాభాకు శాశ్వత తాగునీరు అందించగలం. మేము దీనిని సాకారం చేస్తాం.

చేనేతలకు ఉపాధి కల్పిస్తాం

ప్రొద్దుటూరులో చేనేత కుటుంబాలు ఎక్కువ ఉన్నాయి. వీరంతా చాలీచాలని సంపాదనతో ఇబ్బంది పడుతున్నారు. చేనేతలకు ఉపాధి భరోసా కల్పించి వారిని ఆదుకుంటాం. రేషన్ పట్టుమీద సబ్సిడీలు అందజేస్తాం. చేనేత కార్మికులకోసం అపెరల్ పార్కు ఏర్పాటు చేస్తాం.

పంచాయతీలను ఆర్థిక పరిపుష్టి చేస్తాం

వైసీపీ ప్రభుత్వం వచ్చాక పంచాయతీలన నిర్వీర్యం చేసింది. పంచాయతీలకు కేంద్రం ఇచ్చే నిధులనూ దారి మళ్లించింది. సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చేసింది. టీడీపీ అధికారంలోకి రాగానే.. పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేస్తాం. తాగునీరు, విద్యుత్, రోడ్లు లాంటి మౌలిక వసతులతో పాటు వ్యవసాయ వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచుతాం.

రైతు కష్టాలు ఎరిగినవాడిని

రైతుల కష్టాలు నాకు తెలుసు. ప్రొద్దుటూరు వ్యాపార కేంద్రం అయినా.. ఈ నియోజకవర్గంలో ఎక్కువమంది జీవించేది వ్యవసాయం మీద ఆధారపడే. ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల్లో రైతులకు సాగునీటితో పాటు ఎరువులు విత్తనాలు డ్రిప్ ఇరిగేషన్ సామాగ్రిని అందజేస్తాం. కుందూ-పెన్నా అనుసంధాన వరద కాలువను పూర్తిచేయించి మెట్టప్రాంతాల్లోని రైతులకు సాగునీరు, తాగునీరు అందిస్తాం

కార్పొరేషన్‌గా మార్చి అభివృద్ధి పరుస్తాం

ప్రొద్దుటూరు మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మార్చి రాయలసీమలోనే గొప్పనగరంగా తీర్చిదిద్దుతాం. విశాలమైన రోడ్లు పార్కులు క్రీడామైదానాలు పారిశ్రామిక వాడలు అభివృద్ధి పరుస్తాం. రాబోవు తరాలు మెచ్చేలా ప్రొద్దుటూరును అభివృద్ధి చేస్తాం. ఇక్కడ ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తాం.

స్వేచ్ఛా వ్యాపారాలు సాగేలా..

ప్రొద్దుటూరు రెండో ముంబైగా ప్రసిద్ధి. వ్యాపార కూడలి. అయితే.. వైసీపీ పాలనలో వ్యాపారులు స్వేచ్ఛగా వ్యాపారాలు కొనసాగించలేని పరిస్థితి ఉంది. స్వేచ్ఛా వ్యాపారాలు చేసుకునేలా చూస్తాం. ఇక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లో కొందరిదే పెత్తనం ఉంది. అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఎవరు వెంచర్లు వేయాలన్నా.. అపార్టుమెంటులు కట్టాలన్నా కప్పం కట్టే పరిస్థితి ఉంది. దీనిని రూపుమాపుతాం.

ప్రొద్దుటూరు ఖ్యాతిని కాపాడుతాం

రాష్ట్రంలో ప్రొద్దుటూరు పట్టణానికి ఉన్న ఖ్యాతిని కాపాడుతాం. ముఖ్యంగా ఆధ్యాత్మిక, సాహిత్య కళా రంగాలకు పూర్వ వైభవాన్ని తీసుకొచ్చి కొత్తతరాలను ప్రోత్సహిస్తాం. ఇక్కడి రచయితలు, కవులు, మేధావుల ఘనచరిత్రను కీర్తిని కాపాడుతాం. ఆధ్యాత్మికంగా దేవాలయాలను అభివృద్ధి పరుస్తాం.

అవినీతి వ్యతిరేక పోరాటం

ప్రొద్దుటూరులో తహశీల్దారు, సబ్‌రిజిస్ట్రార్, ఫారెస్టు, పోలీసు కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతికి వ్యతిరేకంగా పోరాడారు. నేరుగా కార్యాలయాలకు వెళ్లిఅధికారులను సాక్ష్యాలతో నిలదీశారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశా రు. దీంతో సబ్‌రిజిస్ట్రార్ రామలక్షుమ్మ, ఫారెస్టు కార్యాలయ సిబ్బంది సస్పెన్షన్‌కు గురయ్యారు.

పార్టీ ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

ప్రొద్దుటూరులో లోకేశ్ పర్యటన దగ్గర నుంచి పార్టీ ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో విజయవంతం చేశారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కానీ.. చంద్రబాబు అక్రమ అరెస్టుపై జరిగిన 50 రోజుల దీక్షలను వందలాది మంది కార్యకర్తలతో నిరాటంకంగా కొనసాగించారు. రాష్ట్ర బంద్ పిలుపులో భాగంగా ప్రొద్దుటూరు బంద్‌ను విజయవంతం చేశారు. కామనూరులో అడ్డుకున్నా పోలీసులను చేదించుకుని వచ్చి ప్రొద్దుటూరు శివాలయం కూడలికి చేరి బంద్ నడిపారు.



చంద్రబాబుతో రోడ్‌షోలో వరద అభివాదం



కమలాపురం చంద్రబాబు పర్యటనకు వెళుతూ అభివాదం చేస్తున్న వరద



రాచమల్లు భూదాహంపై ర్యాలీ చేపట్టిన వరద రాజులరెడ్డి



జలదీక్షలో పాల్గొన్న వరద



రైతు సమస్యలపై మాట్లాడుతున్న వరద



కాగడాల ప్రదర్శన చేస్తున్న వరదరాజులరెడ్డి



బైక్‌ర్యాలీ చేస్తూ...



బాణం పొదులుతున్న వరద



నారాలోకేష్ పర్యటనలో స్వాగతం పలికిన వరద



బీసీల సమావేశంలో మాట్లాడుతున్నవరద



ముస్లింల సమావేశంలో మాట్లాడుతున్న వరద



చంద్రబాబు అరెస్టుకు నిరసనగా రోడ్డుపై బైఠాయించిన వరద



తహసీల్దారు అవినీతిని ప్రశ్నిస్తున్న వరద



నోటికి నల్లరిబ్బన్లతో ఆందోళన చేస్తున్న వరద



అంగన్‌వాడీ వర్కర్ల సమ్మెకు మద్దతుగా వరద

మున్సిపల్ 4వ వార్డు కౌన్సిలర్ ఆత్మహత్య

జమ్మలమడుగు, ఏప్రిల్ 22: జమ్మలమడుగు నగర పంచాయతీ నాలుగో వార్డు వైసీపీ కౌన్సిలర్ వంగల జ్ఞానప్రసూన(29) సోమవారం ఆత్మహత్య చేసుకుంది. కొన్ని నెలలుగా ఈమె కోయంబత్తూరులో నివాసం ఉన్నారు. ఉన్నట్లుండి రాత్రి వంగలజ్ఞానప్రసూన ఆత్మహత్యకు పాల్పడిందని సమాచారం వచ్చిన వెంటనే రాత్రి 8.40 గంటలకు మృతురాలి తండ్రి వంగల నాగేంద్ర, కుటుంబ సభ్యులు హుటాహుటిన బయల్దేరి వెళ్లారు. కాగా ఆమె మృతికిగల కారణాలు తెలియరాలేదు. మృతురాలి భర్త కోయంబత్తూరులో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

ఈ ప్రభుత్వంలో సామాన్యులకు న్యాయం జరగదు


వైసీపీ నుంచి పలు కుటుంబాలు టీడీపీలో చేరిక

ఖాజీపేట, ఏప్రిల్ 22: రాష్ట్రంలో వైసీపీ పాలనలో సామాన్యులకు న్యాయం జరగదని మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని దుంపలగట్టులో ఇండ్ల సుబ్బారెడ్డి, రెడ్యం రవీంద్రారెడ్డి, తవ్వా రవీంద్రారెడ్డి, రెడ్యం ఈశ్వర్‌రెడ్డి, తవ్వా ఓబుళరెడ్డి, అనుచర వర్గం, టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో వంద కుటుంబాలు చేరాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోవిందురెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, ఫరూక్, దస్తగిరిబాబు, హబీబ్, షమి, ప్రతాప్‌రెడ్డి, సుబ్బయ్య, వీరయ్య, వాకుమల్ల వెంకటరామిరెడ్డి, బాలకొండారెడ్డి, హరినాథరెడ్డి, రామానాయుడు, వెంకటేష్, చిన్న, నాగశివారెడ్డి, నాగార్జునయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

● **కొత్తనెల్లూరులో...** మండల పరిధిలోని కొత్తనెల్లూరు హరిజనవాడకు చెందిన మాజీ ఎంపీటీసీ గంగమ్మ, మాజీ సర్పంచ్ లక్షుమయ్య, వార్డు మెంబర్ గురమ్మ, వలంటీరు ఓబులేసు, గురయ్య, ప్రవీణ్, ఓబులేసు అనుచర వర్గం పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో దాదాపు 50 కుటుంబాలు టీడీపీ సమావేశంలో పార్టీలో చేరాయి. ఈ కార్యక్రమంలో వాకుమల్ల వెంకటరామిరెడ్డి , బుచ్చిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మైలవరం..: మండల పరిధిలోని తొర్రివేముల, దొమ్మరనంద్యాల, కల్లుట్ల, పెద్దకొమెర్ల, కరమలవారిపల్లి పంచాయతీల్లో వైసీపీ నుంచి 350 కుటుంబాలు సోమవారం టీడీపీలో చేరాయి. కడప టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేశ్ రెడ్డి, జమ్మలమడుగు ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి సమక్షంలో టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ మల్లేల గురివిరెడ్డి, మాజీ ఎంపీటీసీ కల్లుట్ల పెద్దపుల్లారెడ్డి, ఉప సర్పంచ్‌లు వెంకటేష్ చౌదరి, ఖాదర్, మాజీ సర్పంచ్ బాబు, సర్పంచ్ పుల్లారెడ్డి, వార్డు మెంబర్లు నాగేశ్వరరావు, ఆంజనేయరెడ్డి, శేఖర్, పల్లా బాస్కర్, సిద్దంరెడ్డి చెన్నారెడ్డి ఆధ్వర్యంలో వారి అనుచరులకు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, టీడీపీ నాయకులు వెంకట శివరామిరెడ్డి వెంకటేశ్వర్లు, కర్నాటి రామాంజనేయరెడ్డి, రామకృష్ణారెడ్డి, రంగస్వామి పాల్గొన్నారు.

జమ్మలమడుగు.: జమ్మలమడుగు మండలంలోని మోరగుడి గ్రామంలో సోమవారం తిమ్మని చిన్నచౌడప్ప ఆధ్వర్యంలో 30 కుటుంబాలు ఎన్డీయే కూటమిలో చేరారు. చేరిన వారికి టీడీపీ కడప పార్లమెంటు అభ్యర్థి చదిపిరాళ్ల భూపేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి సి.ఆదినారాయణరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఓటర్లు ఎన్డీయే కూటమికి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన తదితర నేతలు పాల్గొన్నారు.





మైదుకూరు.. పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో టీడీపీలో చేరిన దుంపలగట్టు గ్రామస్థులు, జమ్మలమడుగు... మోరగుడిలో భూపేశ్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి సమక్షంలో పార్టీలో చేరినవారు

బద్వేలుటౌన్..: రాష్ట్రంలో జరుగుతున్న అవినీతికి అడ్డుకట్ట వేసి రానున్న ఎన్నికల్లో అవినీతి నాయకులను తరిమికొట్టి అభివృద్ధికి ఓటు వేయాలని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎత్తిరాజుపల్లె గ్రామం, గాండ్లతిమ్మాయపల్లె నుంచి వైసీపీకి చెందిన 30 కుటుంబాల వారు టీడీపీలోకి చేరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే విజయమ్మ మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో ఎన్‌డీఓ కూటమి అభ్యర్థి బొజ్జా రోశన్నను గెలిపిస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రవికుమార్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, జివి సుబ్బారెడ్డి, మన్యం రామిరెడ్డి, జ్ఞానయ్య, రామసుబ్బారెడ్డి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్..: మండలంలోని ఎర్రబల్లెకు చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో టీడీపీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం గ్రామానికి చెందిన కరెంట్ వెంకట సుబ్బయ్య, కుందేళ్ళ నడిపి వెంకట సుబ్బయ్య, బయనబోయిన నరసింహులు, బొజ్జా నరసింహులు తదితరు దాదాపు 50 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు భీమయ్య, నాయకులు కిశోర్, బొజ్జా ఓబయ్య, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బద్వేలులో విజయమ్మ సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన వారు

వైసీపీకి అంబటి క్రిష్ణారెడ్డి రాజీనామా

●బీజేపీలో చేరేందుకు రంగం సిద్ధం.!

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 22: వైసీపీ ప్రభుత్వంలో వ్యవసాయ మాజీ ప్రధాన సలహాదారు, తిప్పలూరు సర్పంచ్ అంబటి క్రిష్ణారెడ్డి సోమవారం వైసీపీకి రాజీ నామా చేసినట్లు ప్రకటించారు. తన రాజీనామా పత్రాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబుకు సమర్పించినట్లు తెలిపారు. ప్రభుత్వ వ్యవసాయ ప్రధాన సలహాదారునిగా నియమించారన్నారు. అయితే ఈవిషయంలో కూడా తనకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. అందరికి పదవులు రెన్యువల్ చేసినప్పటికీ తనకు మాత్రం చేయకుండా మొండిచేయి చూపారన్నారు. దీంతో అనేక సార్లు సీఎంను కలిసినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఎమ్మెల్యేను కాదని ఎంపీ ఏమీ చేయడని, అలాగే ఎంపీని కాదని సీఎం కూడా ఇక్కడ కార్యకర్తలకు, నాయకులకు ఏమీ చేయడం లేదన్నారు. తన పదవి కాలం పొడగింపును అడ్డుకుంది ఎమ్మెల్యేనే ప్రధాన కారణమని ఆయన ఆరోపిస్తున్నాడు. అతి త్వరలో ఆయన బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరనున్నట్లు విశ్వసనీయ సమాచారం.



పార్టీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబుకు రాజీనామా పత్రం ఇస్తున్న అంబటి

రోశన్న విస్తృత ప్రచారం

బి. కోడూరు, ఏప్రిల్ 22: రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోశన్న పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని రామసముద్రం,అక్కుపాళెం, ఆనం వారిపల్లి గ్రామాల్లో టీడీపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కూటమి అభ్యర్థికి కమలం గుర్తుపై ఓట్లు వేయాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామ్‌మోహన్‌రెడ్డి, శేషారెడ్డి, బాల్‌రెడ్డి, కార్తీక్, పవన్, రాఘవరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, నవీన్, కృష్ణారెడ్డి, దుగ్గిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

మైదుకూరు, ఏప్రిల్ 22 : రాష్ట్రంలోనూ, దేశంలోనూ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ముఖ్యమంత్రి జగన్‌పాలనపై విసుగెత్తిపోయారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మెన్ నర్రెడ్డి తులసిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మైదుకూరు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా గుండ్లకుంట శ్రీరాములు నామినేషన్‌ను దాఖలు చేశారు.

ప్రొద్దుటూరులో నలుగురు నామినేషన్లు

ప్రొద్దుటూరు,ఏప్రిల్ 22 :ప్రొద్దుటూరు ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి సోమవారం నాలుగు పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎస్ఎంపీ నజీర్, బీఎస్పీ నుంచి పిచ్చేళ్ల సుబ్బురాయుడు, వైసీపీ నుంచి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక నుంచి ఈవీ సురేశ్‌బాబు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆర్వో కౌసర్‌బాను తెలిపారు.

కూటమితోనే అభివృద్ధి

జమ్మలమడుగు, ఏప్రిల్ 22: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని దిగువపట్నం కాలనీలో సోమవారం రాత్రి చదిపిరాళ్ల డాక్టర్ రాజేష్‌రెడ్డి, జనసేన నేత నాగార్జున ఇంటింటి ప్రచారం చేశారు. వారు ఇంటింటికి వెళ్లి ఎన్డీయే కూటమితోనే అభివృద్ధి జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి కమలం గుర్తుకు, భూపేశ్‌రెడ్డి టీడీపీ ఎంపీ అభ్యర్థి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

జగన్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి

ప్రొద్దుటూరు ,ఏప్రిల్ 22 : జగన్ మూర్ఖపు ఆలోచనలకు రాబోవు ఎన్నికలలో ప్రజలు ఓటుతో బుద్ధి చెబుతారని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి హెచ్చరించారు. సోమవారం గోపవరం పంచాయతీ పరిధిలోని ఆర్‌టీవో కార్యాల యం వద్ద టీడీపీ ప్రభుత్వంలో నిర్మాణమైన టిడ్కో ఇళ్ళను వైసీపీ నేతల ఆదేశాలతో అధికారుల నేలమట్టం చేయ డంపై వరదరాజులరెడ్డి ఆగ్రహించారు. ఈసందర్భంగా ఆ ప్రాంతానికి వెళ్ళి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కొండారెడ్డి, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, సర్పంచ్ శివచంద్రారెడ్డి, కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి మహ్మద్ గౌస్,ఈవీసుధాకర్‌రెడ్డి, నల్లబోతు నాగరాజు, ఘంటశాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



టిడ్కో గృహాల పునాదులు కూల్చటాన్ని పరిశీలిస్తున్న వరదరాజులరెడ్డి

జోరుగా వరద ప్రచారం

ప్రొద్దుటూరు,ఏప్రిల్ 22 : టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వృద్ధులకు ఏప్రిల్ నుంచే 4 వేల పెన్షన్ ఇస్తానని చంద్రబాబు ప్రకటించారని టీడీపీ అభ్యర్థి వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. సోమవారం 38 వవార్డులోని సాయిరాంనగర్,శ్రీనగర్,శ్రీరాంనగర్ నాగేంద్ర నగర్‌లలో ఎన్నికలప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో దేవగుడి వేణుగోపాల్‌రెడ్డి, బచ్చల పుల్లయ్య, ఆసంరఘు రామిరెడ్డి, వద్ది బాలుడు, సోమా బాలయ్య, గంజికుంట ఆంజనేయులు, ఈవీ సుధాకర్‌రెడ్డి, పల్లా శేషయ్య, చౌడం లక్షుమయ్య, ఇట్టే సునీల్‌కుమార్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు. కాగా మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కుమార్తెలు మెట్టుపల్లి అనురాధ వెన్నపూస అరుణ,కోడలునంద్యాల మీనా, భూపేస్‌రెడ్డి సతీమణి జ్యోతి సోమవారం స్థానిక 32,33 వార్డులలో వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.అంతేగాక ఆయన సోదరులు నంద్యాల భార్గవరెడ్డి నంద్యాల ప్రసాద్‌రెడ్డి14 వవారు శ్రీనివాసనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతేగాక వరదరాజులరెడ్డిని గెలిపించాలని సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి కొత్తపల్లె పంచాయతీ ఖాదరాబాద్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ అభ్యర్థి వరదరాజులరెడ్డిని గెలిపించుకోవడమే లక్ష్యమని టీడీపీ మాజీ కౌన్సిలర్ సీతారామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం వసంతపేటలోని సీతారామిరెడ్డి స్వగృహానికి వరదరాజుల రెడ్డి వెళ్ళి కలిశారు. ప్రొద్దుటూరులో టీడీపీ జెండా ఎగుర వేయడం కోసం అందరూ కలిసి పనిచేయాలని కోరారు. అందుకు సీతారామిరెడ్డి తన వర్గం కార్యకర్తలతో వరదరాజులరెడ్డికి మద్దతుగా ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, కొండారెడ్డి, నల్లబోతుల నాగరాజు, శివచంద్రారెడ్డి, మహ్మద్ గౌస్ మురళీధర్‌రెడ్డి, తలారిపుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం హక్కుల పరిరక్షణకోసం టీడీపీ కట్టుబడివుంది

ప్రొద్దుటూరు,ఏప్రిల్ 22 : ముస్లిం మైనారిటీల పరిరక్షణ కోసం టీడీపీ కట్టుబడి వుందని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం ఎర్రగుంట్ల బైపాస్‌రోడ్డులోని భారత్ ఫంక్షన్ హాలులో ముస్లింల ఆత్మీయసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీఎస్ ముక్తియార్ మాట్లాడుతూ జిల్లా టీడీపీ ప్రభుత్వంలోనే మైనారిటీల సంక్షేమం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు మాజీ అధ్యక్షుడు బేపారి జాకీర్, బేపారి గౌస్, కౌన్సిలర్ మునీర్, మహ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా నామినేషన్లు దాఖలు

జమ్మలమడుగు, ఏప్రిల్ 22: జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గానికి సోమవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు ఏడు నామినేషన్లు దాఖలు అయ్యాయి. కాంగ్రెస్ పార్టీ తరుపున జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థిగా పాముల బ్రహ్మానందరెడ్డి నామినేషన్ వేశారు. బండి రామేశ్వరరెడ్డి ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. సగబాల రామాంజనమ్మ ఇండిపెండెంట్ నామినేషన్ వేశారు. తిమ్మారెడ్డి వెంకటసుబ్బారెడ్డి ఇండిపెండెంట్‌గా, అలాగే వైసీపీ తరుపున ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మూలె సుధీర్ రెడ్డి, అలాగే వైసీపీ తరుపున మూలే క్రాంతిప్రియ నామినేషన్ పత్రాలను ఆర్వో శ్రీనివాసులుకు అందజేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా పెద్దముడియం మండలం పెద్దపసుపుల గ్రామానికి చెందిన ప్రమోద్‌కుమార్‌రెడ్డి నామినేషన్ వేశారు.

బద్వేలు..: బద్వేలు అసెంబ్లీ స్థానాలకు సోమవారం 6 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి ఆకుల వెంకట రమణ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎన్.డీ విజయజ్యోతి, వైసీపీ అభ్యర్థిగా డాక్టర్ సుధ, బీజేపీ అభ్యర్థిగా బొజ్జా రోశన్న తరుపున తన కుమారుడు కార్తీక్ రోశన్ నామినేషన్ పత్రాలు అందించారు. సమాజ్‌వాది పార్టీ తరఫున వెంకట సుబ్బరాయుడు, ఇండిపెండెంట్‌గా మల్లికార్జున, బొజ్జా అరుణమ్మ నామినేషన్ దాఖలు చేసినట్లు అధికారులు తెలిపారు.

మైదుకూరు..: మైదుకూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ సోమవారం అట్టహాసంగా తన నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలసి ఆయన స్థానిక రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకొని ఆర్వో చంద్రమోహన్‌కు తన నామినేషన్ పత్రాలు అందచేశారు. అలాగే తన కుమారుడు పుట్టా రవి కుమార్ యాదవ్ పేరుమీద కూడా ఒక సెట్టు నామినేషన్‌ను అందచేశారు. కాగా పుట్టా సుధాకర్‌యాదవ్ తనకు అప్పులు లేవని, ఆస్తులే ఉన్నట్లు తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. నామినేషన్ దాఖలులో పేర్కొన్న అఫిడవిట్ మేరకు ఎస్ఎల్‌సీ చదువుకున్నానని, తనపై 5 కేసులు ఉన్నాయన్నారు. తనకు తన భార్యకు కలిపి 139.38 గ్రాములు బంగారు ఆభర ణాలున్నాయన్నారు. స్థిరాస్తి విలువ 14,10,72 450, చరాస్తులు విలువ 67,35,79,642 రూపాయలున్నట్లు పేర్కొన్నారు.



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బద్వేలు బీజేపీ అభ్యర్థి రోశన్న తరుపున ఆయన కుమారుడు కార్తీక్ రోశన్, బద్వేలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయజ్యోతి

'పది'లో రవీంద్ర హైస్కూలు విద్యార్థుల ప్రతిభ

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 22: పదోతరగతి పరీక్ష ఫలితాల్లో రవీంద్ర హైస్కూలు విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. టి.వాసుదేవరెడ్డి 594, పి.రామ్‌చరణ్, జి.నిఖిల్ 591 మార్కులు సాధించారు. 64 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 43 మంది విద్యార్థులు 500పైగా మార్కులు సాధించారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ పల్లేటి ప్రభాకర్‌రెడ్డి, పల్లేటి విష్ణుకుమార్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఖాదర్‌వల్లి, ఉపాధ్యాయులు బాలపవన్, పుష్పరాణి, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సరోజిని హైస్కూలు విద్యార్థుల సంచలనం

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 22: 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో వసంతపేటలోని శ్రీ సరోజిని హైస్కూలు విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. ఆర్‌వీఎన్ ప్రణతి 596 మార్కులు సాధించగా తనుశ్రీ 584 మార్కులు సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ వి.జయచంద్రారెడ్డి, హెచ్ఎం శివకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.



ప్రణతి, తనుశ్రీ

గోపీకృష్ణ హైస్కూలు విద్యార్థుల ప్రభంజనం

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 22: సోమవారం వెలువడిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో గోపీకృష్ణ హైస్కూలు విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. టి.మహాలక్ష్మి 589 మార్కులు సాధించగా సాకేత్ రఘురామకశ్యప్ 587 మార్కులు, షేక్ అప్సానా 580, పి.కల్యాణ్ 578, పి.గీతశ్రీ 569, మునిచరణ్ తేజ్ 552 మార్కులు సాధించారు. 30 మంది విద్యార్థులు 500కుపైగా మార్కులు సాధించారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ క్రిష్ణప్రదీప్‌రెడ్డి, ప్రిన్సిపాల్ గంగయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.



మహాలక్ష్మి, సాకేత్ రఘు

నారాయణ విద్యార్థుల విజయకేతనం

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 22: 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో వైఎంఆర్ కాలనీలోని నారాయణ ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. పూజిత 594, పరీక్షిత్ 593, సందేశ్, కార్తీక్ 591, వెంకటపవిత్ర 590, రామతరుణి 590 మార్కులు సాధించారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులను పాఠశాల ఏజీఎం నజీర్ అహమ్మద్, క్లస్టర్ ప్రిన్సిపాల్ శివవీరన్న, ఈటెక్నో ప్రిన్సిపాల్ భాను, ప్రైడ్ ప్రిన్సిపాల్ హుస్సేన్, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జీవనజ్యోతి విద్యార్థుల విజయఢంకా

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 22: 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో జీవనజ్యోతి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారని ఆ పాఠశాల కరస్పాండెంట్ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. 600 మార్కులకు కె.విజయచరణ్ 594, ఎస్.ఆఫ్రిన్ 592, తొమ్మిది మంది విద్యార్థులు 589 మార్కులు సాధించారని తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్, పాఠశాల వ్యవస్థాపకుడు గురుదేవ్‌రామిరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

సమ్మర్ స్విమ్మింగ్ కోచింగ్ క్యాంప్

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 22: రామేశ్వరం-ధర్మల్ రోడ్డులోని ఎస్ఎం స్విమ్మింగ్ పూల్‌లో కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. అనుభవజ్ఞులైన కోచ్‌లతో శిక్షణ ఇవ్వబడుతుందని ఇతర వివరాలకు 9490200912 నంబరులో సంప్రదించాలని కోరారు.

పచ్చా చిన్న వెంగయ్యకు ఘన నివాళులు



పచ్చా చిన్న వెంగయ్య విగ్రహం దగ్గర నివాళులరిస్తున్న కుటుంబ సభ్యులు

పోరుమామిళ్ళ, ఏప్రిల్ 22: పోరుమామిళ్ళ మండలంలోని కమ్మవారిపల్లెకు చెందిన పచ్చా చిన్న వెంగయ్యకు 6 వర్ధంతి సందర్భంగా వెంగమాంబ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ డైరెక్టర్ పుల్లప్ప నాయుడు ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులు పాల్గొని నివాళులర్పించారు. సోమవారం వెంగమాంబ స్కూల్ సమీపంలో ఉన్న ఆయన విగ్రహం వద్ద వారు నివాళులర్పించారు. అనంతరం వివేకనందా ఆశ్రమం అంబకంపల్లె వద్ద బాలమ్మ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.